ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 3 జనవరి 2025



అరాచకం నుంచి అభివృద్ధి వైపు..!

కూటమి ప్రభుత్వం వచ్చాక మారిన జేఎన్‌టీయూ



జేఎన్‌టీయూ దుస్థితిపై సరిగ్గా ఏడాది క్రితం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం ఇది. మానవ వనరుల అభివృద్ధి కేంద్రంగా ఖ్యాతిగడించిన వర్సిటీలో రాజకీయం చొరబడింది. అంతర్గత విభేదాలతో విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేశారు. ప్రవేశాలు, పాఠ్యాంశాల రూపకల్పన, తరగతుల నిర్వహణ, ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ, మూల్యాంకణం, ఫలితాల విడుదల, సర్టిఫికెట్‌ల జారీ.. ఇలా అనేక అంశాల్లో అక్రమాలు, అవినీతి, నిర్లక్ష్యం కొనసాగింది. ఇప్పుడు ప్రభుత్వం మారింది. వర్సిటీలో పరిస్థితులూ మారాయి. అదృశ్య శక్తుల అరాచకం అంతమై.. అభివృద్ధి వైపు అడుగులు పడుతున్నాయి.

7



చంద్రన్న కుటుంబం..!

సభ్యత్వ నమోదులో టీడీపీ దూకుడు


ఉమ్మడి జిల్లాలో 9 లక్షలకు చేరువ

లక్ష లక్ష్యాన్ని దాటి.. టాప్‌లో కళ్యాణదుర్గం

రెండు, మూడు స్థానాల్లో కదిరి, పెనుకొండ

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఉమ్మడి జిల్లాలో చురుగ్గా సాగుతోంది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం లక్ష సభ్యత్వాలు నమోదు చేయించాలని టీడీపీ అధినేత చంద్రబాబు ఎమ్మెల్యేలకు టార్గెట్ ఇచ్చారు. కళ్యాణదుర్గంలో ఇప్పటికే లక్ష్యాన్ని దాటారు. ఉమ్మడి జిల్లాలో అమిలినేని టీం అగ్రస్థానంలో ఉంది. కదిరి, పెనుకొండ తరువాతి స్థానాల్లో ఉన్నాయి. ఉరవకొండ, శింగనమల, తాడిపత్రి ల క్ష్యంలో సగం దూరం కూడా చేరలేదు. సంక్రాంతి వరకూ సమ యం ఉండటంతో ఆ లోగా పని పూర్తి చేయాలని ప్రజా ప్రతినిధులు కార్యాచరణ అమలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తం గా 33,82,343 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో ఇప్పటి వరకూ 8,96,243 మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకోవడం విశేషం.

7



భద్రంగా.. మూలన..!

పెద్దాసుపత్రిలో వృథాగా యంత్రాలు

రూ.కోట్లు వెచ్చించి పంపిన ప్రభుత్వం

వైద్య సేవలకు వినియోగించేది ఎన్నడో..!

అనంతపురం టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలపై నిత్యం విమర్శలు వస్తూనే ఉంటాయి. దీనికి ప్రధాన కారణం.. నిర్వహణాపరమైన నిర్లక్ష్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులు, యంత్ర సామగ్రిని సరిగా వినియోగించడం లేదు. ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రులకు ఎక్కువగా వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదు. జిల్లా సర్వజన వైద్యశాలలో కూడా ఈ తరహా నిర్లక్ష్యమే కనిపిస్తోంది. రూ.కోట్ల విలువ చేసే అధునాతన యంత్రాలను వాడుకోకుండా.. మూలన పడేయడం దీనికి నిదర్శనం.

అట్టపెట్టెల్లో..

జిల్లా సర్వజన ఆస్పత్రిలో పలు కీలక విభాగాలు ఉన్నాయి. అనంత మెడికల్ కాలేజీ పీజీ సీట్లను ఇటీవల పెంచారు. ఆ మేరకు వైద్యసేవలు అందించేందుకు యంత్రాలను మంజూరు చేశారు. జనరల్ మెడిషన్ విభాగానికి రెండు అల్ట్రాసౌండు యంత్రా



లను ప్రత్యేకంగా సమకూర్చారు. ఒక్కొక్క యంత్రం విలువ రూ.25 లక్షలు ఉంటుందని వైద్యులే అంటున్నారు. అదే విభాగానికి గ్యాస్ట్రిక్ సమస్యలను పరీక్షించే ఎండోస్కోపి యంత్రాన్ని ఇచ్చారు. దాని విలువ రూ.30 లక్షలు. ఊపిరితిత్తుల సమస్యలు తెలుసుకోవడానికి బ్రాంకోస్కోపీ యంత్రాలు రెండు వచ్చాయి. ఒక్కొక్క యంత్రం రూ.35 లక్షలు విలువ చేస్తుంది. వీటిలో ఒకటి జనరల్ మెడిషన్ విభాగానికి, మరొకటి పల్మనాలజీ విభాగానికి కేటాయించారు. ఇవన్నీ వినియోగంలో ఉంటే రోగులకు మెరుగైన వైద్యం అందుతుంది. కానీ అట్ట పెట్టెల్లో.. వచ్చినవి వచ్చినట్లే భద్రంగా మూలన పెట్టేశారు.

పర్యవేక్షణ ఏమైంది..?

జిల్లా సర్వజన వైద్యశాలకు ఇంత అధునాతన, ఖరీదైన యంత్రాలు వస్తే.. వాటిని వినియోగంలోకి తీసుకురావాలన్న ఆలోచన ఏ ఒక్కరూ చేయలేదు. ఈ యంత్రాల ద్వారా చేసే పరీక్షలకు (స్కానింగ్) ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో వేలాది రూపాయలు వసూలు చేస్తారు. బ్రాంకోస్కోపీకి రూ.4 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లే చెబుతున్నారు. జిల్లా ఆస్పత్రికి 2019లోనే బ్ర్యాంకోస్కోపీ యంత్రం వచ్చిందని అంటున్నారు. పల్మనాలజీ విభాగం డాక్టర్లు ఆ యంత్రాన్ని ఓ గదిలో పెట్టి మరచి పోయారు. ఆ విభాగానికి కొత్తగా మరో యంత్రం వచ్చింది. దీంతో ఆ విభాగానికి చెందిన ఓ వైద్యుడు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఉన్న యంత్రాన్నే వాడటం లేదని, కొత్త యంత్రాన్ని అదనంగా ఎందుకు పంపించారు..? ఎవరు వినియోగిస్తారని వ్యాఖ్యానించినట్లు సమాచారం. ప్రభుత్వ వైద్యశాలలో ఆ యంత్రాలను ఏర్పాటు చేస్తే.. ప్రైవేటు ఆస్పత్రులలో వ్యాపారం దెబ్బతింటుందని కొందరు ఉద్దేశపూర్వకంగా మూలన పడేశారని ప్రచారం జరుగుతోంది. ఇంత జరుగుతున్నా పర్యవేక్షణ అధికారులు పట్టించుకోవడం లేదు.

సంక్రాంతి తర్వాత..



కొత్త యంత్రాలు కొన్నాళ్ల క్రితం వచ్చాయి. వాటిని బిగించడానికి టెక్నీషియన్ రావాల్సి ఉంది. ఇప్పటికే సమాచారం ఇచ్చాం. సంక్రాంతి తర్వాత ఇన్‌స్టాల్ చేయించి, రోగులకు సేవలు అందేలా చూస్తాం. ముందే వచ్చిన బ్రాంకోస్కోపీ యంత్రం గురించి విచారిస్తాను.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్



అట్టపెట్టెలో ఉన్న అల్ట్రాసౌండ్ యంత్రాలు



ఓ గదిలో మూలన ఎండోస్కోపీ, బ్రాంకోస్కోపీ యంత్రాలు

బార్ అసోసియేషన్‌లో రచ్చ



అనంతపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

అధ్యక్షుడిని నిలదీసిన న్యాయవాదులు

నా గొంతు మార్ఫింగ్ చేసి ప్రచారం చేశారు

టూటౌన్‌లో న్యాయవాది రాము ఫిర్యాదు

కొనసాగిన న్యాయవాదుల నిరసన

రేపటి వరకు విధుల బహిష్కరణ

అనంతపురం క్రైం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బార్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం రచ్చగా మారింది. సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతిపై తాము చేస్తున్న ఆందోళనలకు ఎందుకు మద్దతివ్వడం లేదని జిల్లా అధ్యక్షుడిని న్యాయవాదులు ప్రశ్నించారు. జిల్లా కోర్టు ఆవరణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు అధ్యక్షుడికి పలు ప్రశ్నలు సంధించారు. కొన్ని రోజులుగా తాము నిరసనలు చేస్తుంటే ఎందుకు భాగస్వామ్యం కాలేదని ప్రశ్నించారు. పోలీసులకు అనుకూలంగా ప్రవర్తిస్తున్నారంటూ మండిపడ్డారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా.. న్యాయవాది పోలీస్‌స్టేషన్‌లో మృతి చెందితే ఆ కుటుంబానికి ఎందుకు అండగా నిలబడటం లేదని నిలదీశారు. 'మీరున్నా లేకపోయినా మేము ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తాం' అని స్పష్టం చేశారు. శేషాద్రి కుటుంబానికి న్యాయం చేసేవరకు పోరాడుతామని తెలిపారు. ఈనెల 4వతేదీ వరకు విధులు బహిష్కరించడంతో పాటు నిరసనలు కొనసాగేలా సమావేశంలో తీర్మానించారు. అదే రోజు మరోసారి జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు న్యాయవాదులు తెలిపారు.

నా గొంతును మార్ఫింగ్ చేశారు...

తన గొంతు మార్ఫింగ్ చేసిన ఆడియో రికార్డింగ్ ఒకటి తనకు తెలియకుండా ప్రచారం చేశారని న్యాయవాది రాము ఆరోపించారు. ఈ మేరకు వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన గురువారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 29న ఉదయం తాను డీఎస్పీతో సంభాషించినట్లు ఆడియో రికార్డింగ్ వాట్సాప్‌లో గ్రూప్‌లో వచ్చిందన్నారు. ఎవరో తన గొంతుని మార్ఫింగ్ చేసి ప్రచారం చేశారని పేర్కొన్నారు. దీనివల్ల న్యాయవాదుల సమాజంలో తన పరువుకు భంగం కలుగుతోందని పేర్కొన్నారు. తన సీనియర్ న్యాయవాది శేషాద్రి మరణం విషయంలో పోలీసులకు అనుకూలంగా ఉండేలా ఎవరో ఉద్దేశపూర్వకంగా ఇలా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు వ్యక్తిగతంగా, సామాజికంగా నష్టం చేకూర్చారని పేర్కొన్నారు. విచారణ చేసి బాధ్యులపై కేసు నమోదు చేయాలని, తనకు న్యాయం చేయాలని కోరారు.

కొనసాగిన న్యాయవాదుల నిరసన

న్యాయవాది శేషాద్రి మృతిపై విచారణ చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. శేషాద్రి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోవిందరాజులు, న్యాయవాదులు వెంకటరాముడు, నారాయణరెడ్డి, మేడా అనూరాధ, ధర్మసింగ్ నాయక్, సాకే నరేష్, బాలకృష్ణ, బాబాఫకృద్దీన్, రామవేంద్ర, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శించిన కర్నూలు న్యాయవాదులు

న్యాయవాది శేషాద్రి కుటుంబాన్ని కర్నూలు జిల్లా న్యాయవాదులు పరామర్శించారు. కర్నూలు, డోన్, పత్తికొండకు చెందిన న్యాయవాదుల సంఘం ప్రతినిధులు గోపాలకృష్ణుడు, ప్రభాకర్, ఆనంద్, వీరేష్, వేణుగోపాల్, వాల్మీకి అర్జున్, రంగస్వామినాయుడు, నాగేంద్రుడు, రామయ్య, బాలకృష్ణ తదితరులు శేషాద్రి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

మాటలు.. మంటలు



తాడిపత్రిలో విలేకరులతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

దివాకర్ బస్సు దహనం

షార్ట్ సర్క్యూట్ అంటున్న పోలీసులు

నిప్పు పెట్టారన్న జేసీ ప్రభాకర్ రెడ్డి

(వివరాలు మెయిన్‌లో)

పబ్లిక్ నోటీసు

మేము ఇక్కడ వ్రాసిన ("షెడ్యూల్ ప్రాపర్టీస్") షెడ్యూల్‌లో మరింత ప్రత్యేకంగా వివరించిన భూమి యజమానుల శీర్షికను పరిశీలిస్తున్నాము. విక్రయం, బదిలీ, మార్పిడి, అసైన్‌మెంట్, విల్, విడుదల, ఉపసంహరణ, డిక్రీ లేదా ఆర్డర్ ద్వారా షెడ్యూల్ ప్రాపర్టీస్‌లో లేదా దానిలోని ఏదైనా భాగంలో ఏదైనా వ్యక్తి హక్కు, టైటిల్, దావా, ప్రయోజనం, డిమాండ్ లేదా ఆసక్తిని కలిగి ఉంటే లేదా క్లెయిమ్ చేస్తే ఏదైనా న్యాయస్థానం, భారం, తనఖా, లీజు, తాత్కాలిక హక్కు, ఛార్జ్, నిర్వహణ, లైసెన్స్, బహుమతి, వారసత్వం, అవిభక్త వాటా, స్వాధీనం, సౌలభ్యం, ట్రస్ట్, బిక్విస్ట్, సబ్ లీజు, అద్దె, ఉప-అద్దె, సెలవు మరియు లైసెన్స్, లిస్ పెండెన్స్‌లు, సౌలభ్యం, ఎంపికలు, మొదటి తిరస్కరణ హక్కు లేదా ఏదైనా స్వభావం లేదా ఇతరత్రా లేదా ఎలాగైనా, లేదా ఏదైనా ఒప్పందం కింద, దస్తావేజు, పత్రం లేదా న్యాయవాది యొక్క అధికారం లేదా ఏదైనా అభ్యంతరం/లు ఏ పద్ధతిలో అయినా తెలియజేయడం అవసరం ఈ నోటీసు తేదీ నుండి 7 (ఏడు) రోజులలోపు క్రింద సంతకం చేసిన వారి క్రింద పేర్కొన్న చిరునామాలో దిగువ సంతకం చేసిన వారికి, దానికి మద్దతుగా నోటరీ చేయబడిన/ధృవీకరించబడిన డాక్యుమెంటరీ రుజువు యొక్క నిజమైన కాపీలతో వ్రాతపూర్వకంగా, విఫలమైతే టైటిల్ యొక్క శీర్షిక అని భావించబడుతుంది. షెడ్యూల్ ప్రాపర్టీలు స్పష్టంగా, చెల్లుబాటు అయ్యేవి మరియు విక్రయించదగినవి మరియు షెడ్యూల్ ప్రాపర్టీలపై ఎవరికీ ఎలాంటి హక్కులు, టైటిల్, ఆసక్తి, దావా, డిమాండ్ ఉండవు. సపోర్టింగ్ డాక్యుమెంట్లు లేని ఏదైనా క్లెయిమ్‌లు స్వీకరించబడవు. దయచేసి మీ కవరుపై ఆంధ్ర ప్రదేశ్, అనంతపురం అని గుర్తు పెట్టండి.

షెడ్యూల్ ప్రాపర్టీలు (భూమి యొక్క వివరణ)

ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా, కంబదూరు తాలూకా, రాళ్లపల్లి, రాళ్ల అనంతపురం గ్రామాలు మరియు మరింత ప్రత్యేకంగా క్రింద వివరించబడిన సుమారు 40.76 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్థిరాస్తి యొక్క మొత్తం ముక్క మరియు పార్సిల్:

స. నెం	గ్రామం / మండలం / జిల్లా	ఖాతా నం.	Sy. సంఖ్య.	యజమాని పేరు	మొత్తం పరిధి (ఎకరాలు)
1	రాళ్ల అనంతపురం, రాళ్లపల్లి, / కంబదూరు / అనంతపురం	255	38-A	కమ్మ నాగేంద్ర	1.10
		777	38	గాదుల శ్రీదేవి	2.94
		988	503-1	గాదుల శ్రీదేవి	5.00
		43	39-4&39-3	కమ్మ చంద్రకళ	4.82
		1185	38	కమ్మ మీనాక్షి	1.66
		1468	38	కమ్మ అనిత	2.21
		44	38-A	కమ్మ వెంకటేశ్వర్లు	2.21
		251	45-A	ఎర్రలపల్లి శివారెడ్డి	5.00
		203	46-1	ఎర్రలపల్లి లక్ష్మీదేవి	2.54
		235	45	ఎర్రలపల్లి రవీంద్ర	4.95
		1412	135-A	ఈడిగ సుకన్య	4.23
		1413	135-C	ఈడిగ మంజుల	4.10
				మొత్తం	40.76

సం/- **ప్రతాప్ పోగులకొండ**, న్యాయవాది, 8-2-120/86/9.303.3వ అంతస్తు, 8-2-120/86/9.303.3వ అంతస్తు, GK టైమ్స్ స్క్వేర్, ఎదురుగా: పార్క్ హయత్ హోటల్ బంజారా హిల్స్, రోడ్ నెం 2, హైదరాబాద్- 500034, తెలంగాణ, మొబైల్ నెం : 9966807021, 7013212657 Email: vm305239@gmail.com, prataplawofficehyd@gmail.com





న్యూస్ బాక్స్

నేటి నుంచి ఎస్ఎస్‌బీఎన్ వసంతోత్సవాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల్లో మూడు రోజుల పాటు నిర్వహించే 80వ వసంతోత్సవాలను జయప్రదం చేయాలని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం పాఠశాలకు సంబంధించిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం, శనివారం జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల సమ్మేళనం, ఆదివారం డిగ్రీ, పీజీ పూర్వ విద్యార్థులు, అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం, సన్మానాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల్లో విద్యనభ్యసించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు హాజరవుతున్నారన్నారు.

హంసఫర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంతకల్లు, జనవరి2(ఆంధ్రజ్యోతి): ఉత్తర రైల్వేలోని జమ్ముతావిలో జరుగుతున్న యార్డు పనుల కారణంగా తిరుపతి-జమ్ముతావి-తిరుపతి (వయా గుంతకల్లు) హంసఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును ఒక ట్రిప్పును రద్దు పరుస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. తిరుపతి-జమ్ముతావి (నం. 22705) ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 7న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22706)ను ఈనెల 10వ తేదీన రద్దు చేయనున్నట్టు పేర్కొన్నారు.

అభ్యంతరాలకు నేడే ఆఖరు

అనంతపురం విద్య, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ టీచర్ల సీనియారిటీ జాబితాపై శుక్రవారం సాయంత్రంలోగా అభ్యంతరాలు తెలియజేయాలని డీఈఓ ప్రసాద్‌బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం, తెలుగు, హిందీ, ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ప్రమోషన్లు ఇస్తున్నామన్నారు. ప్రమోషన్లకు అర్హులైన టీచర్ల తాత్కాలిక సీనియారిటీ జాబితా డీఈఓ బ్లాగ్ స్పాట్‌లో ఉంచామని తెలిపారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సాయంత్రం 5 గంటలలోగా తగిన ఆధారాలతో హెచ్ఎం, ఎంఈఓల ద్వారా తెలియజేయాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కడప జోన్ పరిధిలో 150 కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 3 నుంచి 17వతేదీ వరకు పని రోజుల్లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు నమూనా, ఇతర వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ సూచించారు.

ఎమ్మార్పీ పోస్టు కోసం..

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ-సీడాప్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీలు సంయుక్తంగా పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్‌ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద పనిచేయడానికి మండల రిసోర్స్ పర్సన్ పోస్టుల నియామకాలకు ఈనెల 5వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. డిగ్రీ చదివి, కంప్యూటర్, ఇంటర్‌నెట్ పరిజ్ఞానం, స్మార్ట్‌ఫోన్ కలిగి ఉండి 21-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన పురుషులు, మహిళలు అర్హులన్నారు. ఈనెల 5వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 8న అనంతపురం పంగల్‌రోడ్డు సమీపంలోని టీటీడీసీలో రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులు జిల్లాలోని ఎంపికైన మండలంలో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న ఔత్సాహికవేత్తలకు అవగాహన కల్పించడం, పరిశ్రమల ఏర్పాటు, పురోగతి సాధించడానికి సహకరించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులకు ఒక పరిశ్రమ ఏర్పాటు చేయడానికి రూ.20వేలు పారితోషికం చెల్లిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 8985091256, 8639439808, 8639448535లను సంప్రదించాలన్నారు.

8న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

అనంతపురం విద్య, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈ నెల 8వ తేదీ నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న ఉదయం 10.30 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో ఆర్థిక, ప్రణాళిక, వర్క్స్, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరుగుతాయన్నారు. జడ్పీ అదనపు సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరుగుతాయన్నారు.

రేపటి నుంచి కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

అనంతపురం విద్య/కొత్తచెరువు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యాశాఖాధికారులు ప్రసాద్‌బాబు, కిష్టప్ప గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు సమీపంలోని పాఠశాల ఏజెన్సీల ద్వారా అందిస్తారన్నారు. స్కూళ్లలో వండిన భోజనాన్ని జూనియర్ కళాశాలలకు చేర్చే బాధ్యత కాలేజీ ప్రిన్సిపాళ్లదేనని పేర్కొన్నారు.

సహకారం బలోపేతం

- సొసైటీలను పటిష్టం చేయడానికి చర్యలు
- సేవలను ప్రజలకు చేరువ చేసే యత్నం
- ఆధునిక పరికరాలతో వ్యవసాయానికి అండ
- ఆన్‌లైన్ సేవలతో అక్రమాలకు చెక్
- చురుగ్గా కంప్యూటరైజేషన్ ప్రక్రియ


రాచానపల్లి సొసైటీ



డీసీఓ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సొసైటీలు ఇక పటిష్టంగా మారనున్నాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్)లను అతి త్వరలో మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా రూపాంతరం చేసేందుకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. అందులో భాగంగానే మొదటి దశలో సొసైటీలను కంప్యూటరైజేషన్ చేసే ప్రక్రియ చేపట్టారు. ఇప్పటికే సొసైటీల ఆన్‌లైన్ ప్రక్రియ దాదాపుగా తుది దశకు చేరింది. జాతీయ స్థాయిలో నేషనల్ డెవలప్‌మెంట్ కమిటీ, రాష్ట్ర స్థాయిలో స్టేట్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీలతో పాటు జిల్లా స్థాయిలో డీసీడీసీ(డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) కన్వీనర్‌గా ఉండే కమిటీలో జేసీ, జడ్పీ సీఈఓ, పశుసంవర్థక శాఖ జేడీ, మత్స్యశాఖ డీడీ, డీపీఓ, నాబార్డు డీడీఎంలతో పాటు ఆయా సమన్వయ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. సొసైటీలలో ఆన్‌లైన్ సేవలను ప్రారంభించి అవినీతి, అక్రమాలను అరికట్టి, రైతులకు మెరుగైన, నాణ్యమైన పారదర్శక సేవలు అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతులకు ఉపయోగకరమైన ఆధునిక వ్యవసాయ పరికరాలు, డ్రోన్‌లను వ్యవసాయంలో ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపడుతోంది.

మల్టీపర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేసి ప్రజలకు మరిన్ని సేవలు చేరువచేయడానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఇదివరకు పనిచేసిన మీ-సేవ కేంద్రాల తరహాలో అన్ని రకాల సేవలను అందించేందుకు యోగిస్తున్నారు. అన్ని రకాల సేవలు అంటే మొబైల్ రీచార్జితో మొదలు విద్యుత్తు బిల్లులు, రవాణాకు టికెట్లు బుకింగ్ ఇలా అన్నీ సీఎస్‌సీ(కస్టమర్ సర్వీస్ సెంటర్) ద్వారా అందించనున్నారు. రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు అందించేందుకు సీడ్ సొసైటీ, సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించేందుకు ఆర్గానిక్ సొసైటీ, రైతులు పండించిన పంటలను ఎగుమతి చేసేందుకు ట్రాన్స్‌పోర్ట్ సొసైటీలతో సహకార సొసైటీలను అనుసంధానం చేయనున్నారు. వీటితో జిల్లాలో రాచానపల్లి, పి కొత్తపల్లి పరిధిలో వంకరాజు కాలవ, ఎద్దులపల్లి, పాళ్యంతండా, బొమ్మనహాళ్, బేలేడు, బుక్కరాయసముద్రంలో గోడౌన్లను ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటలను నిల్వచేయనున్నారు. యల్లనూరు, కణేకల్లు ప్రాంతాలతో పాటు నార్పల, ఆమిద్యాల, కూడేరులలో సొసైటీల ఆధ్వర్యంలో పెట్రోలు బంకులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే యల్లనూరులో ప్రారంభించగా, కణేకల్లులో పనులు జరుగుతున్నాయి. ప్రజలకు తక్కువ ధరకే మందులు అమ్మేందుకు జన ఔషధి పేరుతో జనరిక్ మందుల షాపులను సొసైటీల ఆధ్వర్యంలో ప్రారంభించారు. తొలి విడతలో అనంతపురం డీసీఎంఎస్, రాచానపల్లి, ముచ్చుకోట, గుంతకల్లు, రాయదుర్గం ఉద్దేహాల్, కళ్యాణదుర్గం చాపిరిలో ప్రారంభించారు.

అద్దెకు ఆధునిక వ్యవసాయ పరికరాలు

మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలలో ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరికరాలు ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వ్యవసాయంలో ఆధునిక పరికరాలు, యంత్రాలతో పాటు డ్రోన్‌లు ఏర్పాటు చేయనున్నారు. రైతులకు ఖరీదైన ఆధునిక వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేయడానికి ఆర్థిక స్తోమత లేని పరిస్థితుల్లో మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలలో నామమాత్రపు అద్దెతో వీటిని అందుబాటులోకి తేవాలని యోచిస్తున్నారు. ఈ ప్రతిపాదనలు ఇప్పటికే జిల్లా నుంచి ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి పంపినట్లు సమాచారం. ఈ ఆలోచన అమలుచేస్తే జిల్లాలో, రాష్ట్రంలో వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం పెరిగే అవకాశం మెండుగా కనిపిస్తోంది.

కొలిక్కి వచ్చిన కంప్యూటరైజేషన్

సొసైటీల కంప్యూటరైజేషన్ ఇప్పటికే ఓ కొలిక్కివచ్చింది. మొదటి విడతలో ఖాతాలు, రుణాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పెట్టుబడి ఇతరత్ర అంశాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రెండో విడతలో ఆడిట్‌లో ఇతరత్ర అంశాలను నమోదు చేయనున్నారు. మూడో విడతలో 2024ఏప్రిల్ 1 నుంచి క్యాష్ డిపాజిట్ ఇతర లావాదేవీలు నమోదు చేయాలి. నాలుగో విడతలో ఆన్‌లైన్‌లో లైవ్‌లో ఉంచడం చేపట్టనున్నారు. దీంతో సొసైటీలలో అక్రమాలకు తావులేకుండా వ్యవహారాలన్నీ ఆన్‌లైన్‌లో నిర్వహించడం. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి చేసి పీఏసీఎస్‌లను మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. దీంతో ఆర్థిక లావాదేవీలతో పాటు సబ్సిడీ ధరలకు రైతులకు ఎరువులు, మందులు, విత్తనాలు విక్రయించడం జరుగుతుంది. ఏప్రిల్ 1 నుంచి సొసైటీలు పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో లావాదేవీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సభ్యులకు ఈ-కేవైసీ తప్పనిసరి

ప్రాథమిక వ్యవసాయ పరపతి (పీఏసీఎస్)సొసైటీ సభ్యులు ఈ-కేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం సూచించింది. జిల్లాలోని 58సొసైటీలకు సంబంధించి స్పెషల్‌డ్రైవ్ ద్వారా గ్రామ సచివాలయాల్లో ఈ-కేవైసీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఈ-కేవైసీ చేయించుకోని సభ్యులకు ప్రభుత్వం నుంచి వచ్చే ఎటువంటి లబ్ధి చేకూరదు. గ్రామ-వార్డు సచివాలయాలలో వేలిముద్రలు, ఇతరత్ర పత్రాలను అందజేసి ఓటీపీ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 1వతేదీ తరువాత సొసైటీలలో అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే ఉంటాయని, ఈ-కేవైసీ లేకుండా ఎటువంటి లావాదేవీలు చేయడానికి అవకాశం ఉండదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

సొసైటీలతో రైతులకు బహుళ ప్రయోజనాలు



ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలను మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేయడంతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయి. మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీల సేవలను వినియోగించుకోవడానికి సభ్యులు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ-వార్డు సచివాలయాలలో రైతులు (సభ్యులు) ఈ-కేవైసీ చేయడానికి ఏర్పాటు చేశాం. సొసైటీలలో పారదర్శక సేవలు అందించేందుకు కంప్యూటరీకరణ దోహదం చేస్తుంది.

- అరుణకుమారి, జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)

జబ్బొస్తే.. అంతే..!

- పశువుల ఆస్పత్రుల్లో మందుల కొరత
- 2024-25 బడ్జెట్ కేటాయించని వైనం
- ముగిసిన మందుల సరఫరా కాంట్రాక్ట్
- ఇబ్బందిపడుతున్న పాడి రైతులు


పశువైద్యశాల

తాడిపత్రి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పశువుల ఆసుపత్రుల్లో మందుల కొరత ఏర్పడింది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తున్నామని జబ్బలు చరిచే ప్రభుత్వాలు కనీసం మందులు కూడా అందించలేని దుస్థితిలో ఉన్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పశువుల ఆస్పత్రులు 15, డిస్పెన్సరీలు 56, గ్రామీణ పశువైద్యశాలలు 14, రైతు సేవా కేంద్రాలు 367 ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఆవులు 2,15,896, గేదెలు 1,89,843, గొర్రెలు 22,97,300, మేకలు 4,12,094, కోళ్లు 10,36,664 ఉన్నాయి. వీటన్నింటికి ఏడాదికి మందుల కోసం రూ.2.50కోట్ల బడ్జెట్ వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో వైద్యులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో వైద్యుల కొరత కూడా ఉండటంతో పలు ఆసుపత్రుల్లో అటెండర్లే వైద్యం చేస్తున్నారు. 2024-25కు సంబంధించి పశువుల మందుల కోసం గత ప్రభుత్వం బడ్జెట్ కూడా కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రెండు త్రైమాసికాలకు బడ్జెట్ కేటాయించినా మందులు మాత్రం సరఫరా చేయలేదు. దీంతో ఏ చిన్న సమస్యపై ఆస్పత్రులకు పశువులను తీసుకువెళ్లినా ఇక్కడ మందులు లేవని, డాక్టర్లు బయటకు పంపిస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రులకు మందులు సరఫరా చేసే రేట్ కాంట్రాక్టర్ సమయం డిసెంబరు ఆఖరికే పూర్తయినట్లు కొందరు వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం మరో కాంట్రాక్టర్‌ను పిలిచి, టెండర్ వేసి, మందులు సరఫరా చేయాలంటే దాదాపు 3నుంచి 4నెలలు సమయం పడుతుంది. అందుకే ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించి మందుల కొరత తీర్చాలని రైతులు కోరుతున్నారు.

డాక్టర్లు వైద్యం బాగా చేస్తున్నారు



డాక్టర్లు వైద్యం బాగా చేస్తున్నారు. కానీ ఆస్పత్రిలో కొన్ని రకాల మందులు లేకపోవడంతో పాడిరైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో పాడిపై ఆధారపడిన రైతుల సంఖ్య ఎక్కువగా ఉంది. అయితే పశువులకు వచ్చే జబ్బులకు ఆస్పత్రిలో మందులు లేకపోవడంతో రైతులపై అదనపు భారం పడుతుంది.

- లక్ష్మణ్, తాడిపత్రి

మందులు బయటకు రాసిస్తున్నారు..

ఆస్పత్రికి పశువులను తీసుకొస్తే కొన్ని మందులు ఇక్కడ ఉన్నాయి. కొన్ని మందులు లేవని బయటకు పంపిస్తున్నారు. ఆసుపత్రిలోనే పశువులకు మందులు లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. ప్రశ్నిస్తే మందులు ఉంటే మేమెందుకు ఇవ్వమని, ఉన్నవాటినే సర్దుతున్నామని అధికారులు చెబుతున్నారు. దీంతో చేసేదేమిలేక బయట నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- నారాయణరెడ్డి, తాడిపత్రి

సాధ్యమైనంత వరకు మందులు ఇస్తున్నాం..



గొర్రెలు, మేకలు, కుక్కల టీకాలకు మందులు తక్కువ లేకుండా వివిధచోట్ల తెప్పించుకుంటున్నాం. కానీ కొన్ని మందులు లేవన్నది వాస్తవమే. ప్రస్తుతం మందుల కొరత ఉండటంతో ఇండెంట్ పెట్టాం. కానీ మందులు వచ్చేంత వరకు సర్దుకుంటూ వైద్యం చేస్తున్నాం.

- ఖాదర్‌బాషా, వైద్యుడు

శిథిలావస్థలో మార్కెట్ భవనం


పైకప్పు పెచ్చులూడి బయట పడిన ఇనుప కడ్డీలు

- ఊడుతున్న పైకప్పు పెచ్చులు
- బిక్కుబిక్కుమంటూ ఉద్యోగుల విధులు
- మూలుగుతున్న రూ.60 లక్షల నిధులు


ఊడుతున్న పెచ్చులు

అనంతపురం రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనం శిథిలావస్థకు చేరుతోంది. భవన నిర్మాణం జరిగి అర్థ శతాబ్దం కావస్తోంది. భవనానికి చాలా చోట్ల పెచ్చులూడిపోయాయి. గోడల్లోని ఇనుప కడ్డీలు బయటకు కనిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల గోడలు బీటలు వారాయి. దీంతో కార్యాలయంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నూతన భవన నిర్మాణానికి రూ.60 లక్షలు నిధులు మంజూరయ్యాయి. భవన నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. ఇంతలోనే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. ప్రస్తుత ప్రజాప్రతినిధులు చొరవచూపితే నూతన భవన నిర్మాణానికి మోక్షం కలుగుతుంది.

ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

గతంలో కార్యాలయ నిర్మాణాలు ఇష్టారాజ్యంగా జరిగాయి. 1977లో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2008లో భవనానికి మరమ్మతులు చేశారు. ఈ క్రమంలో వివిధ పాలకవర్గ సభ్యుల కాలంలో ఎవరికి వారు పనులు చేయించుకుంటూ వెళ్లారు. 2009లో అతిథి గృహం నిర్మించారు. 2012లో సమావేశ మందిరం ప్రారంభించారు. ఈవిధంగా అప్పటి పాలకవర్గ సభ్యులు నిర్మాణాలు చేయించారు. పాత భవనాన్నే ఆధునీకరించారు. ఈ క్రమంలో రూ.లక్షలు ఖర్చు చేశారు. ఏళ్లు గడిచిపోవడంతో చాలా చోట్ల భవనం దెబ్బతినింది. అతిథి గృహ గదులు పాత బంగ్లాలను తపిస్తున్నాయి. దీనికితోడు పలుచోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి.

పాలకులు చొరవచూపితేనే..

గత ప్రభుత్వ హయాంలో నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. యార్డులో వివిధ నిర్మాణాల నిమిత్తం 2022లో దాదాపు రూ.12 కోట్లు కేటాయించారు. ఇందులో నూతన కార్యాలయ నిర్మాణానికి రూ.60లక్షలు కేటాయించారు. నిధులు కూడా మంజూరయ్యాయి. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నూతన భవన నిర్మాణానికి మోక్షం లభించలేదు. దీంతో కమిటీ ఖజానాలో నిధులు మూలుగుతున్నాయి. ప్రస్తుత పాలకులు, అధికారులు చొరచూపితే నూతన భవన నిర్మాణం జరిగే అవకాశం ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



నూతన కార్యాలయ భవన నిర్మాణంతో పాటు యార్డులోని వివిధ నిర్మాణాల గురించి పాలకులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈనెల 8న మార్కెటింగ్ శాఖ మంత్రి గుంటూరులో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నిర్మాణాలపై చర్చించే అవకాశం ఉంది. మేము కూడా ప్రజాప్రతినిధులు, ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- గోవిందు, ఎంపికశ్రేణి కార్యదర్శి, మార్కెట్ కమిటీ

కలెక్టర్ దృష్టికి సమస్యలు

- ఆకాశవాణి 'అనంతమిత్ర'లో ఫిర్యాదుల వెల్లువ


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

అనంతపురం టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆకాశవాణి కేంద్రంలో కలెక్టర్ వినోద్‌కుమార్ నిర్వహించిన 'అనంత మిత్ర'కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గురువారం ఆకాశవాణి కేంద్రంలో కలెక్టర్ ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం7-45 గంటల నుంచి 8-15 వరకు సమస్యలు విన్నారు. ఈ సందర్భంగా అనంతపురం రామచంద్రనగర్‌కు చెందిన చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ నగరపాలక పాఠశాలలో తన కూతురు చదువుతోందని, టీచర్లు డ్యూటీకి రావడంలేదన్నారు. కమిషనర్, డీఈఓ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఇందుకు కలెక్టర్ స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశించారు. లలితనగర్‌కు చెందిన శారదా మాట్లాడుతూ.. బళ్లారి బైపాస్ నుంచి టవర్‌క్లాక్‌వరకు ఏర్పాటు చేసిన బ్రిడ్జి అపరిశుభ్రంగా ఉందన్నారు. లలితనగర్‌లో 200 ఇళ్లు ఉన్నాయని, రోడ్డు, తాగునీరులేక ఇబ్బందులు పడుతున్నామని చర్యలు తీసుకోవాలని కోరారు. నగరానికి చెందిన నరసింహారెడ్డి మాట్లాడుతూ.. నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో సులబ్ కాంప్లెక్సులు సరిగా నిర్వహించడంలేదన్నారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వస్తున్న ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అవసరమైన చోట ఏర్పాటు చేయాలని కోరారు. యాడికికి చెందిన గురుమూర్తి మాట్లాడుతూ.. రోడ్లు, డ్రైనేజీ సమస్యలు అధికంగా ఉన్నాయని పరిష్కరించాలని కోరారు. రాప్తాడు మండలం బొమ్మేపర్తికి చెందిన ఇస్మాంరెడ్డి మాట్లాడుతూ.. ముగ్గురికి కలిపి ఒక ట్రాన్స్‌ఫార్మర్ త్రీఫేజ్ కరెంట్ ఇవ్వాలని అనుమతులు ఇచ్చినా ఇంతవరకు పనులు మొదలు పెట్టలేదని ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులును ఓపికగా విన్న కలెక్టర్ వినోద్ కుమార్ వాటిని ఆయా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పర్కిరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ విశ్వనాథ్, నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర, ఆకాశవాణి డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ స్థలాలను కాపాడుకోవాలి

- వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ
- డీఎఫ్ఓ విఘ్నేష్

అనంతపురం న్యూటౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అటవీ స్థలాలను కాపాడుకోవాలని డీఎఫ్ఓ విఘ్నేష్ సిబ్బందికి సూచించారు. గురువారం అనంతపురం రేంజ్ పరిధిలోని సిబ్బందికి అటవీ స్థలాల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు మండలం పంపనురులోని నగరవనం సమావేశ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎఫ్ఓ మాట్లాడుతూ.. వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. అడవిలో వన్యప్రాణుల నుంచి స్థానిక ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన జాగ్రత్తలు చేపట్టేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అటవీశాఖ స్థలాలు, నాటిన మొక్కలు, అడవిలోని వన్యప్రాణులను ఏ విధంగా కాపాడవచ్చో వివరించారు. అనంతరం మరుట్ల సౌత్ బీట్‌కు వెళ్లి అక్కడ నాటిన మొక్కలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సిబ్బంది వారికి ఉన్న సమస్యలను డీఎఫ్ఓ దృష్టికి తీసుకెళ్లారు. మరుట్ల సౌత్‌బీట్‌లో 20 హెక్టార్లలో నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ శిక్షణలో రేంజర్ శ్రీనివాసులు, సెక్షన్ ఆఫీసర్ అక్బర్, బీట్ ఆఫీసర్స్ నీలవేణి, తేజేశ్వర్‌రెడ్డి, జగదీష్, శ్రీకాంత్, రవిచంద్రారెడ్డి, ఏబీఓలు గిరీష్, రామ్మోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

7 నుంచి కరువు బృందం పర్యటన..?

అనంతపురం అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీ్‌ఫలో పంటనష్టంపై అధ్యయం కోసం సెంట్రల్ మినిస్ట్రీయల్ బృందం (కరువు బృందం) ఈనెల 7వతేదీ నుంచి ఉమ్మడి జిల్లా పర్యటనకు రానున్నట్లు సమాచారం. ఇదివరకు ఈనెల 2, 3 తేదీల్లో కరువు బృందం ఉమ్మడి జిల్లాలోని కరువు మండలాల్లో పర్యటించనున్నట్లు షెడ్యూల్ ఖరారైంది. అనివార్య కారణాలతో పర్యటన వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఈనెల 7 నుంచి 9వతేదీ వరకు రాష్ట్రంలో కరువు బందం పర్యటించనున్నట్లు ఈ మేరకు గురువారం షెడ్యూల్ ఖరారైనట్లు తెలిసింది. తొలుత ఉమ్మడి జిల్లాలోనే కరువు బృందం సభ్యులు పర్యటించే అవకాశం ఉన్నట్లు ఆ వర్గాల ద్వారా తెలుస్తోంది.

నేడు జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్

అనంతపురం విద్య, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ రాప్తాడు మోడల్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించనున్నారు. మండలస్థాయి నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి గణితం, సైన్స్ ప్రాజెక్టులు సుమారు 70 వరకూ జిల్లా సైన్స్ ఫెయిర్‌కు వచ్చే అవకాశం ఉందని విద్యాశాఖాధికారులు స్పష్టం చేశారు. జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో అత్యుత్తమ ప్రాజెక్టుల ఎంపిక మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నారు. జిల్లా సైన్స్ ఫెయిర్ నుంచి రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు 6 ప్రాజెక్టులను ఎంపిక చేయనున్నారు.

లా, బీఈడీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ గడువు పెంపు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): లా, బీఈడీ కోర్సుల్లో అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ల గడువును ఈనెల 5 వరకు పొడిగించినట్లు ఉన్నత విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది. యూనివర్సిటీల్లో స్పాట్ అడ్మిషన్లు, ప్రైవేటు లా, బీఈడీ కాలేజీల్లో కేటగిరీ బీ అడ్మిషన్లకు ఈ గడువు వర్తిస్తుందని తెలిపింది. అభ్యర్థుల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇకపై ఎలాంటి పొడిగింపు ఉండదని స్పష్టం చేసింది.

కేజీబీవీ ట్రైనర్లకు శిక్షణ ప్రారంభం

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): 'టీచింగ్ అనేది వృత్తి కాదని, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకత్వం చేసే బాధ్యత' అని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బీ.శ్రీనివాసరావు అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోని మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం విజయవాడలోని లయోలా లా కాలేజీలో ఆయన ప్రారంభించారు. కేజీబీవీ టీచర్లు బాలికల జీవితాలను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని, బాలికలకు భద్రత, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తారన్నారు. ఈ శిక్షణా సదస్సు నుంచి మెరుగైన బోధనా విధానాలు నేర్చుకుని, కేజీబీవీల్లో నాణ్యమైన విద్యనందించాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ కార్యదర్శి డి.దేవానందరెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన శనివారం మెనూ మార్పు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో శనివారం అందించే ఆహారం మెనూను సవరిస్తూ మధ్యాహ్న భోజనం పథకం డైరెక్టర్ బీ.శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత మెనూ ప్రకారం శనివారం రోజున విద్యార్థులకు ఆకు కూర అన్నం(పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా), పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగి జావ ఇస్తున్నారు. ఇక నుంచి ఆకు కూర అన్నం స్థానంలో సాధారణ అన్నం పెట్టి, స్థానికంగా అందుబాటులో ఉండే కూరగాయలతో కూర, స్వీట్ పొంగల్, రాగి జావ అందించాలని ఆదేశించారు.

చంద్రన్న కుటుంబం..!

సభ్యత్వ నమోదులో టీడీపీ దూకుడు.. ఉమ్మడి జిల్లాలో 9 లక్షలకు చేరువ

- లక్ష లక్ష్యాన్ని దాటి.. టాప్‌లో కళ్యాణదుర్గం
- రెండు, మూడు స్థానాల్లో కదిరి, పెనుకొండ
- 50 వేల మార్కు దాటని మూడు నియోజకవర్గాలు
- సంక్రాంతి వరకూ గడువు..
- లక్ష్యం చేరేలా కార్యాచరణ







అనంతపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో పార్టీ సభ్యత్వాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో లక్ష్యానికి మించి సభ్యత్వం చేయించాలని ప్రజా ప్రతినిధులకు చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎమ్మెల్యేలు ఎవరికివారు తమ నియోజకవర్గాన్ని సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో నిలపాలని ప్రయత్నిస్తున్నారు. ద్వితీయశ్రేణి నాయకులు, ముఖ్యులకు సభ్యత్వ నమోదు బాధ్యతలను అప్పగించారు. దాదాపు రెండు నెలల క్రితం సభ్యత్వ నమోదు ప్రక్రియ మొదలైంది. కొన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు సభ్యత్వ నమోదులో దూకుడు పెంచారు. మరికొన్ని చోట్ల లక్ష సభ్యత్వాల లక్ష్యం కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. మూడు నియోజకవర్గాల్లో మాత్రం ఇంకా 50 వేల మార్క్ దాటలేదు. మొత్తంమీద.. గతంతో పోలిస్తే సభ్యత్వ నమోదులో టీడీపీ దూకుడు పెంచిందనే చెప్పాలి.

తొమ్మిది లక్షలకు చేరువ

- ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో ఇప్పటి వరకూ సభ్యత్వ నమోదు గణాంకాలు 9 లక్షలకు చేరువలో ఉన్నాయి. అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని కళ్యాణదుర్గం, అనంతపురం అర్బన్, రాయదుర్గం, గుంతకల్లు, ఉరవకొండ, శింగనమల, తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 17,47,314 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 4,13,757 మంది టీడీపీ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ లెక్కన ఓటర్లలో 23.67 శాతం మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు.
- హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని కదిరి, పెనుకొండ, రాప్తాడు, మడకశిర, పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 16,35,029 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 4,82,486 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. మొత్తం ఓటర్లలో ఇది 29.50 శాతం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 8,96,243 మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోనే అత్యధికంగా సభ్యత్వాలు నమోదయ్యాయి.

కళ్యాణదుర్గం టాప్

- టీడీపీ సభ్యత్వ నమోదులో కళ్యాణదుర్గం నియోజకవర్గం అగ్రస్థానంలో ఉంది. ఇప్పటికే నిర్దేశించుకున్న లక్ష సభ్యత్వాల లక్ష్యాన్ని పూర్తి చేసుకుంది. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నేతృత్వంలో స్థానిక నాయకుల చొరవతో గురువారం నాటికి 1,00,792 సభ్యత్వాలు నమోదయ్యాయి. ఆ నియోజకవర్గంలో మొత్తం 2,28,421 మంది ఓటర్లు ఉండగా.. 44.12 శాతం మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు.
- రెండో స్థానంలో కదిరి నియోజకవర్గం ఉంది. ఇక్కడ 85,245 సభ్యత్వాలు నమోదయ్యాయి. మూడో స్థానంలో ఉన్న పెనుకొండ నియోజకవర్గంలో 77,197 సభ్యత్వాలు నమోదయ్యాయి. నాలుగో స్థానంలో రాప్తాడు 76,776 సభ్యత్వాలు, ఐదో స్థానంలో అనంతపురం అర్బన్‌లో 70,241 సభ్యత్వాలు, ఆరో స్థానంలో రాయదుర్గంలో 68,337 సభ్యత్వాలు, ఏడో స్థానంలో మడకశిర 66,400 సభ్యత్వాలు, ఎనిమిదో స్థానంలో పుట్టపర్తి 64,055 సభ్యత్వాలు, తొమ్మిదో స్థానంలో ధర్మవరం 61,363 సభ్యత్వాలు, పదో స్థానంలో గుంతకల్లు 59,242 సభ్యత్వాలు, 11వ స్థానంలో హిందూపురం 51,450 సభ్యత్వాలు నమోదయ్యాయి.
- అనంతపురం జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో సభ్యత్వ నమోదు 50 వేల మార్కు దాటలేదు. ఇందులో ఉరవకొండ 48,064 సభ్యత్వాలు, శింగనమలలో 44,650 సభ్యత్వాలు, తాడిపత్రిలో 22,431 సభ్యత్వాలు మాత్రమే నమోదయ్యాయి. సంక్రాంతి వరకూ సభ్యత్వాల నమోదుకు గడువు ఉంది. ఆ లోగా లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు ప్రయత్నం చేస్తున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

శాశ్వత సభ్యత్వాలు ఆశాజనకం

టీడీపీ ఆవిర్భావం నుంచి క్రియాశీలక సభ్యత్వాలనే నమోదు చేస్తున్నారు. ఈసారి కొత్తగా శాశ్వత సభ్యత్వాలకు శ్రీకారం చుట్టారు. రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నవారికి పార్టీ అధినేత చంద్రబాబును కలిసే అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో శాశ్వత సభ్యత్వం పట్ల కొందరు ఆసక్తి కనబరిచారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకూ 26 మంది శాశ్వత సభ్యత్వాలు తీసుకున్నారు. అనంత అర్బన్‌లో అత్యధికంగా ఏడుగురు, ఉరవకొండలో నలుగురు, మడకశిరలో నలుగురు, శింగనమలలో ముగ్గురు శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. రాయదుర్గం, గుంతకల్లు మినహా.. మిగిలిన నియోజకవర్గాల్లో ఒక్కొక్కరు శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.

దర్జాగా జలచౌర్యం..

కాలువ నీటిని మళ్లించుకున్న ఆవుల ఫాం యజమాని

అడ్డుచెప్పిన అధికారులపై చిందులు





క్వారీలోకి మళ్లించిన నీరు, డీఈపై చిందులు తొక్కుతున్న ఆవుల ఫాం యజమాని (ఎడమ)

బత్తలపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడి కాలువ ద్వారా చెరువులకు వదిలిన నీటిని ఓ ఆవుల ఫాం యజమాని దర్జాగా మళ్లించాడు. మూతబడిన క్వారీలోకి వదులుకున్నాడు. దీనిని అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులపై రుబాబు చేశాడు. వాగ్వాదానికి దిగాడు. కుడి కాలువ ద్వారా బత్తలపల్లి, నారసింపల్లి చెరువులకు అధికారులు బుధవారం నీటిని వదిలారు. ఆ నీటిని మండలంలోని అనంతసాగరం గ్రామ సమీపాన ఆవుల ఫాం యజమాని గోపాల్ మళ్లించాడు. కల్వర్టు వద్ద కాలువకు అడ్డంగా రాళ్లు వేసి, మూతబడిన తన క్వారీ గుంతలోకి మళ్లిం చుకున్నాడు. విషయం తెలుసుకున్న నీటిపారుదల శాఖ డీఈ మహేశ్వరరెడ్డి, ఏఈ భవిత గురువారం బత్తలపల్లికి చెందిన రైతులతో కలిసి అక్కడికెళ్లారు. కాలువ నీటిని అక్రమంగా మళ్లించడం నేరమనీ, వెంటనే ఆపాలని గోపాల్‌కు సూచించారు. దీంతో అతడు ఆగ్రహంతో ఊగిపోయాడు. నీటి మళ్లింపును ఆపేది లేదనీ, చేతనైనది చేసుకోండంటూ రుబాబు ప్రదర్శించాడు. 'నేనంటే ఏమనుకున్నారు? నన్నే బంద్ చెయమంటారా, చేసిది లేదు ఏం చేసు కుంటారో.. చేసుకోండి. ఆపేదేలేదు. ఇక్కడి నుంచి వెళ్లిపోండి..' అంటూ అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో ఆవుల ఫాం యజమాని వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామంటూ డీఈ, ఏఈ వెళ్లిపోయారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి: ఆపస్

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల అంశాలను ప్రస్తావించకపోవడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) అధ్యక్షుడు ఎస్.బాలాజీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా.. ఇంతవరకు రూ.25 వేల కోట్ల బకాయిలు, ఐఆర్, డీఏ, 12వ పీఆర్ అంశాలపై సానుకూల ప్రకటనలు లేవన్నారు. ప్రతి నెలా రెండుసార్లు క్యాబినెట్ సమావేశాలు జరుగుతున్నా.. ఉద్యోగుల అంశాలపై చర్చ జరగట్లేదన్నారు. సంక్రాంతి కానుకగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

9న మెగా జాబ్‌మేళా

ధర్మవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సీఎస్‌బీ కల్యాణమండపంలో ఈనెల 9న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 90 దాకా బహుళజాతి కంపెనీలు పాల్గొంటాయన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, బీఫార్మసీ, ఎం ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, పీజీ చదివన 18 నుంచి 35 ఏళ్లలోపు వయసువారు అర్హులన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నెలకు రూ.10వేల నుంచి రూ.50వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు విద్యార్హత పత్రాల నకలు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. వివరాలకు 9182288465, 9490442576, 9390176421 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వ్యవసాయ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



ఏపీ వ్యవసాయ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా నూతన కమిటీ

అనంతపురం అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సంఘం (ఏపీఏఈఏ) ఉమ్మడి అనంత జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గురువారం స్థానిక కృషి భవన్‌లో ఏపీ వ్యవసాయ ఉద్యోగుల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ రఘురామనాయుడు, కోశాధికారి శ్రీహరి, ఉపాధ్యక్షుడు రూపేష్‌కుమార్ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా శశిధర్‌రెడ్డి, కార్యదర్శిగా నరసింహ, సహఅధ్యక్షుడిగా ఆనందరాజు, కోశాధికారిగా ఆదిల్‌బాషా, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, నారాయణస్వామి, శివకుమార్, రామలింగారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా నాగభూషణం, అనిల్, రాజేష్, మోహన్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రాజ్యలక్ష్మి, ఖాద్రి, ఈసీ సభ్యులుగా లీలావతి, వెంకటేశ్వర్లు, రహంతుల్లా, రాష్ట్ర ఈసీ సభ్యులుగా శశికళ, హేమంత్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆనందరాజు, సురేంద్ర, సత్యనారాయణ, నరసింహ, కడప జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలోనే సాంకేతిక విద్యకు ఎంతో ప్రఖ్యాతిగాంచిన జేఎన్టీయూ గత వైసీపీ హయాంలో కునారిల్లింది. మితిమీరిన రాజకీయ జోక్యం, కొన్ని అదృశ్య శక్తులు వర్సిటీ ప్రతిష్టను మసకబార్చాయి. కూటమి ప్రభుత్వం రాకతో ఆరునెలల్లోనే పరిస్థితులు చాలా వరకు మారాయి. గత వైసీపీ పాలనలో ఉన్నతాధికారుల మధ్య వైరాన్ని సృష్టించి రెండుగా చీల్చారు. ఆకస్మిక బదిలీలు, ఆలస్యంగా ఉద్యోగోన్నతులు, ప్రశ్నించిన వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడింది. ప్రతిభ, అర్హతకు పాతరేసి, తమకు నచ్చిన వారికే ఉద్యోగోన్నతులు, ఉన్నత పదవులు, కీలక స్థానాలు కట్టబెట్టడంలో అదృశ్య శక్తులు పనిచేశాయి. ఆ అరాచకాలకు చరమగీతం పాడుతూ జేఎన్టీయూ.. మరోసారి అభివృద్ధి వైపు పయనిస్తోంది. పారదర్శకమైన పాలన లక్ష్యంగా ఉన్నతాధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం సెంట్రల్



జేఎన్టీయూ పరిపాలనా భవనం

అరాచకం నుంచి అభివృద్ధి వైపు..

విద్యార్థుల భవిష్యత్తు, ఉద్యోగుల సంక్షేమం దిశగా జేఎన్‌టీయూ



వర్సిటీ అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ అంశాల్లో యాజమాన్యం తీసుకునే నిర్ణయాలు వేలాదిమంది విద్యార్థులు, వందలాదిమంది ఉద్యోగులపై ప్రభావం చూపుతాయి. జేఎన్టీయూ పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు ఉమ్మడి జిల్లాల్లో ఇంజనీరింగ్ 72, ఫార్మసీ 45, ఎంసీఏ, ఎంబీఏ 67.. ఇలా మొత్తం 184 కళాశాలల భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. ప్రవేశాలు, పాఠ్యాంశాల రూపకల్పన, తరగతుల నిర్వహణ, ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, ఫలితాల విడుదల, సర్టిఫికెట్ల జారీ.. ఇలా అనేక అంశాల్లో వర్సిటీ యాజమాన్య నిర్ణయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. గత వైసీపీ పాలనలో అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులు, ఉద్యోగులు, కళాశాలలు కునారిల్లాయి. వాటికి చరమగీతం పాడుతూ నూతన యాజమాన్యం పారదర్శమైన పాలన సాగిస్తోంది.

పారదర్శకమైన నిర్ణయాలు...

పారదర్శక పాలన లక్ష్యంగా నిర్ణయాలు

కూటమి రాకతో వర్సిటీలో మార్పులు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో జేఎన్‌టీయూ వీసీ, రిజిస్ట్రార్ (ఫైల్)

విద్యార్థుల భవిష్యత్తుకు నాంది..

ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏలోని పలుకోర్సులను జేఎన్టీయూ అందిస్తోంది. ప్రతియేటా వేలాదిమంది డిగ్రీ పట్టాలను పుచ్చుకుంటున్నారు. గత ఐదేళ్లలో ఉద్యోగ కల్పనను ఎండమావిగా మారింది. చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం పొంది జీవితంలో స్థిరపడాలన్న విద్యార్థులు, తల్లిదండ్రుల ఆకాంక్షలను కలగానే మిగిల్చారు. వారి కలలను సాకారం చేసేలా కొత్త యాజమాన్యం ప్రయత్నాలు సాగించింది. కియ సంస్థ ప్రతినిధులతో చర్చించి తమ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాలని ఒప్పందాన్ని కుదుర్చుకుంది. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సంప్రదించి వాటికి అవసరమైన రీతిలో విద్యార్థులకు శిక్షణ చేపట్టింది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పద్ధతుల్లో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి వందలాదిమంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. విద్యార్థులను ఉద్యోగాలకు సన్నద్ధం చేసేలా క్లబ్‌లను ఏర్పాటు చేసి కోఆర్డినేటర్లుగా ఫ్యాకల్టీని నియమించింది.



ఆర్థిక ప్రయోజనాలు చెల్లించడంతో వీసీ సుదర్శనరావుని సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు (ఫైల్)

ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం..

ఉద్యోగుల సమస్యలు ఒక్కొక్కటి పరిష్కారమవుతున్నాయి. రిటైర్డ్ ఉద్యోగులకు దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనాలను చెల్లించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పెరిగిన జీతాలను జమచేశారు. ఉద్యోగులకు డీఏ బకాయిలు విడుదలచేశారు. అర్హత, అనుభవం ప్రాతిపదికగా బదిలీలు చేశారు. ప్రమోషన్లు ఇచ్చేందుకు మెరిట్ జాబితాను రూపొందించారు. ఇలా అనేక సమస్యలను నూతన యాజమాన్యం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోందని ఉద్యోగ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు ఎప్పుడు బదిలీ వస్తుందో తెలియని పరిస్థితి. నిత్యం అభద్రత నడుమ విధులు నిర్వహించారు. ప్రశ్నిస్తే కక్షసాధింపు చర్యలకు బలికావాల్సి వచ్చేది. గొంతువిప్పిన వారిపై వేటువేసేవారు. ఒక మాజీ వీసీ, రాష్ట్రస్థాయిలో కీలకంగా వ్యవహరించిన మరో అధికారి వర్సిటీని వెంటాడి తమ జీవితాలతో ఆటాడుకున్నారని ఉద్యోగ వర్గాలు గుర్తుచేసుకుంటున్నాయి. అభివృద్ధి పనుల కాంట్రాక్టులు, హాస్టల్ నిర్వహణ, సరకుల సరఫరా.. ఇలా ఏదైనా వారి వర్గానికి దక్కించుకుని లబ్ధిపొందారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

పూర్వవైభవాన్ని తీసుకువస్తున్నాం..

విశ్వవ్యాప్తంగా కీర్తిని చాటిన వర్సిటీకి పూర్వవైభవం తీసుకువస్తున్నాం. విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దే విశ్వవిద్యాలయాలపై గత ప్రభుత్వం కక్షసాధింపు ధోరణి అవలంభించింది. అడ్డగోలు నిర్ణయాలతో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థలను నీరుగార్చారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కు సమస్యలను వివరించడంతో సానుకూలంగా స్పందిస్తున్నారు. ఈ మేరకు రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు చెల్లించాం. టీచింగ్ అసిస్టెంట్స్‌కు పెరిగిన జీతాలిచ్చాం. వందలాదిమంది విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాం. కియ కంపెనీతో పాటు జాతీయ, అంతర్జాతీయ సంస్థలను సంప్రదించి ఎంఓయూలు చేసుకుంటున్నాం.

-ప్రొఫెసర్ సుదర్శనరావు, ఇన్‌చార్జ్ వీసీ



ఫుట్‌బాల్ మహిళా జట్టులో అనూష



మ్యాచ్ ఆడుతున్న అనూష (ఫైల్)

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ అండర్-20 భారత మహిళ జట్టులో జిల్లాకు చెందిన క్రీడాకారిణి అనూష చోటు సంపాదించింది. ఆత్మకూరుకు చెందిన అనూష 2015 నుంచి ఫుట్‌బాల్ ఆడుతోంది. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. గతేడాది అండర్-19 భారత ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్‌లో చోటు దక్కించుకుంది. ప్రస్తుతం ఆర్డీటీ ఫుట్‌బాల్ అకాడమీలో రెసిడెన్షియల్‌లో సాధన చేసుకుంటూ... ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. బెంగళూరులో శుక్రవారం మాల్దీవులతో జరిగే ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత అండర్-20 జట్టు తరఫున అనూష ఆడనుంది. అనూషను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్, ఏపీ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, మల్లేష్, ఆర్డీటీ ఫుట్‌బాల్ కోఆర్డినేటర్ దాదా ఖలందర్ అభినందనందించారు.

గంగమ్మ ఆలయంలో చోరీ...

అనంతపురం క్రైం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం కామారుపల్లి సమీపంలోని గంగ మ్మ ఆలయంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి ఆలయంలోకి ప్రవేశించి వెండివస్తువులు, హుండీని పగలకొట్టి కొంత నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రి నుంచి వ్యక్తి అదృశ్యం...



మల్లప్ప

అనంతపురం క్రైం, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రి నుంచి ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. శ్రీ సత్యసాయి జిల్లా పరిగి మండలం బీచ్‌గానిపల్లికి చెందిన మల్లప్ప ఈ నెల 30వ తేదీన ప్రభుత్వాసుపత్రిలో డెలివరీ కోసం వచ్చిన కోడలిని చూడటానికి వచ్చాడు. కొంతసేపటికే అక్కడి నుంచి అదృశ్యమయ్యాడు. అతడు గురువారం కూడా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

తాడిపత్రి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం గుర్తుతెలియని వృద్ధుడు (70) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి అనారోగ్యంతో మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఎవరికైనా ఇతడి ఆచూకీ తెలిస్తే తమకు తెలపాలని వారు కోరారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

రాయలసీమ డిపోల నుంచి 2,327 సర్వీసులు

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల కోసం రాయలసీమ జిల్లాల్లోని డిపోల నుంచి మొత్తం 2,327 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు తెలిపారు. గురువారం ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు 1147 బస్సులు, 14 నుంచి 19వ తేదీ వరకు 1180 బస్సు సర్వీసులు నడపుతామన్నారు. అనంతపురంతోపాటు సత్యసాయి, నంద్యాల, కర్నూలు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, వైఎస్ఆర్ కడప జిల్లాల పరిధిలోని అన్ని ఆర్టీసీ డిపోల నుంచి సర్వీసులను నడుపుతామని పేర్కొన్నారు. ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయలేదని తెలిపారు. ఆన్‌లైన్‌లో సైతం ముందస్తు రిజర్వేషన్లు పొందవచ్చునన్నారు. రాను, పోను ఒకేసారి బుక్ చేసుకున్నవారికి టికెట్ ధరలో 10శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. రద్దీ ప్రాంతాలైన బెంగుళూరుకు 406, హైదరాబాద్‌కు 442, విజయవాడకు 107, చెన్నైకు 24 సర్వీసులను ప్రత్యేకంగా నడుపుతున్నామని పేర్కొన్నారు.

గర్భం దాల్చిన బాలిక..?

అనంతపురం రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఓ ప్రభుత్వ కళాశాలలో మైనర్ విద్యార్థిని గర్భం దాల్చిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారం బయట పొక్కకుండా సంబంధిత కళాశాల అధ్యాపకులు సద్దుమణిగించారు. ఆ అమ్మాయి నగర శివారుల్లోని ఓ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. పదిరోజుల కిందట విద్యార్థిని కడుపు అనుమానాస్పందంగా కనిపించడంతో అధ్యాపకులు వైద్యులకు చూపించారు. సదరు విద్యార్థిని గర్భందాల్చినట్లు నిర్ధారించుకున్నారు. దీంతో అధ్యాపకులు విద్యార్థిని తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. ఈ క్రమంలోనే విద్యార్థినితో పూర్తి విషయాలను ఆరా తీశారు. తరువాత తల్లిదండ్రులు, విద్యార్థినితో కళాశాల అధ్యాపకులు లెటర్ రాయించుకున్నట్లు తెలుస్తోంది. విషయం జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత శాఖ అధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలోనే గురువారం ఉన్నతాధికారులు విచారించినట్లు తెలిసింది. ఈ విషయంపై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్, శాఖల ఉన్నతాధికారులను సంప్రదించగా.. అలాంటి ఘటన ఏమీ జరగలేదని అన్నారు.

టన్ను రూ.28 వేలు

అనంతపురం రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 28,190 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 11 వేలు, సరాసరి రూ. 18 వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఎస్ఐ విజయ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

శింగనమల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ శరత్‌చంద్ర వీఆర్‌కు బదిలీకాగా, ఆయన స్థానంలోకి రైల్వే ఎస్ఐగా పనిచేస్తున్న విజయ్‌కుమార్ బదిలీ అయ్యారు. నూతన ఎస్ఐ గురువారం సీఐ కౌలుట్లయ్యను కలసి బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్ఐ చితంబరయ్య పోలీసు సిబ్బంది స్వాగతం పలికారు. తెలుగు యవత పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నగరూరు పెద్దన్న, టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, డీలర్లు రాయల్ సత్యనారాయణ, శివకుమార్ నూతన ఎస్ఐని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పరమేశ్వరన్ ప్రమాణ స్వీకారం



పరమేశ్వరన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పరమేశ్వరన్ ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, కార్పొరేషన్ ఉన్నతాధికారుల సమక్షంలో తన తోటి డైరెక్టర్లతో కలిసి పరమేశ్వరన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

వేగవంతంగా టీడీపీ సభ్యత్వ నమోదు

రామగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు తిరిగి వేగవంతంగా చేపడుతున్నారు. మండలంలోని పేరూరుతోపాటు పలు గ్రామాల్లో గురువారం టీడీపీ స్థానిక నాయకులు సభ్యత్వ నమోదు చేపట్టారు. అధిష్టానం మరో 15 రోజులు గడువు పొడిగించడంతో స్థానిక నాయకులు దీనిపై దృష్టిసారించి ఇంటింటికి వెళ్లి సభ్యత్వం నమోదు చేస్తున్నారు. మండలంలో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. పేరూరులో అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి 80 సభ్యత్వాలకు డబ్బులు చెల్లించి, నమోదు చేయించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడుషేక్ దాదాపీర్, బూత్ కన్వీనర్ చాంద్‌బాషా, నాయకులు వెల్డింగ్ గంగన్న, దండో రా శ్రీరాములు, ముకుంద, ముత్యాలు, గంగాధర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరిటాల రవీంద్ర ట్రస్టు ఆధ్వర్యంలో మోడల్ టెస్టు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు భవిష్యత్తు కోసం ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ప్రత్యేక చొరవతో పుస్తకాలు పంపిణీ చేయిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మండలంలో 600 మందికి పైగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన టీడీపీ మండల ఇన్‌చార్జ్ బాలాజీ, తాటి బండ్ల ప్రభాకర్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. టీడీపీ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, వెంకటనారాయణ, వెంకటేశులు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, నీమ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గార్లదిన్నె, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎగువపల్లి సమీపంలో 44వ జాతీయ రహ దారిపై వాహనం ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. గురు వారం తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీ సులు తెలిపారు. అయితే ప్రమాదంలో మృతి చెందినది యాచికుడా...? మతిస్థిమితం లేని వ్యక్తినా...? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అదేవిధంగా ప్రమాదానికి కారణమైన వాహనం కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు.

'ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి'



మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ, కార్యాలయ సిబ్బంది

రాప్తాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. న్యూ ఇయర్ సందర్భంగా గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో కలిసి ఎంపీడీఓ మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షిస్తేనే భవిష్యత్ తరాల వారు ఆరోగ్యంగా జీవిస్తారని తెలిపారు. మొక్క లు పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేద్దాం: సర్పంచ్

రాప్తాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేద్దామని సర్పంచ్ సాకే తిరుపాలు తెలిపారు. రాప్తాడులోని బీసీ కాలనీలో గురువారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని, సకాలంలో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కూలీలు, రైతులు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ శివ, ప్రజలు పాల్గొన్నారు.

నిండా నిర్లక్ష్యం..!

- వందల మంది తిరిగే రోడ్డుపై విద్యుత్ తీగలు
- ఆదమరిస్తే ప్రాణాలు గాలిలో కలవాల్సిందే..



రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు



ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వెళుతున్న విద్యుత్ తీగలు

నార్పల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్లపల్లిలో జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న రోడ్డుపై ప్రమాదకరంగా విద్యుత్‌తీగలను ఏర్పాటు చేశారు. వాటిని రోడ్డుమీదే అడ్డంగా తీసుకెళ్లడంతో.. ఏ మాత్రం ఆదమరిచినా వారు ప్రాణాలు గాలిలో కలవాల్సిందే. ఈ దారి పక్క నే ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులు చదువుకుం టున్నారు. అంతేకాకుండా ఆ పరిసర ప్రాంతంలో సచివాలయం, హెల్త్ సెంటర్ ఉన్నాయి. గ్రామస్థులు అదే దారి గుండానే వెళ్లాల్సి ఉంది. పంచాయతీ అధికారులు తాగునీటి కోసం ఈ విద్యుత్ తీగలను ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చి రోడ్డుపైన పరిచినట్లు తెలిసింది. అయితే విద్యుత్ స్తంభాలు కావాలని అనేక సార్లు విద్యుత్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తెలిపారు. దాదాపు ఆర్నెల్లుగా ఈ రోడ్డుపైనే విద్యుత్ తీగలు ఉండడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం వచ్చిన ఆ విద్యుత్ తీగలపై నడవడానికి భయాందోళనకు గురవుతున్నామని వాపోతున్నారు. పాఠశాల పక్కనే పిల్లలు ఆడుకోవడానికి వెళ్తుంటారని, పొరపాటున ఆ విద్యుత్ తీగలను పట్టుకుంటే ఏ క్షణం ఏమి జరుగుతుందోననే తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికి విద్యుత్, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డుపై విద్యుత్ తీగలను ఏర్పాటుచేయడంపై సర్వత్రా విమర్శలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధింత అధికా రులు చొరవ తీసుకుని రోడ్డుపై వెళుతున్న విద్యుత్ తీగలు తొలగిం చాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా మారిన రోడ్లకు మోక్షం

- ఎమ్మెల్యే పరిటాల సునీత



నసనకోటలో కొత్తగా వేసిన బీటీ రోడ్డుపై ఎమ్మెల్యే పరిటాల సునీత, గ్రామస్థులు

రామగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా చాలా అధ్వానంగా ఉన్న రోడ్లకు కూటమి ప్రభుత్వంలో మోక్షం వచ్చిందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని నసన కోట పంచాయతీ ఎగువపల్లి(కొత్తగేరి)లో బస్టాండ్ సెంటర్ నుంచి కర్ణాటక సరిహద్దు వరకు కిలోమీటరు మేర రూ.30 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ఆమె గురువారం పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే వెంకటాపురంలో రూ. 60 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్లను పరిశీలించారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడద్దని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ గ్రామాల అభివృద్ధికి తొలిప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అలాగే కనగానపల్లి మం డలం నరసంపల్లి వ్యవసాయక్షేత్రంలో ఆమె చీనీ, కొబ్బరిపంటలను పరిశీలించి దిగుబడి బాగా రావడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఆమె వెంట టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, శ్రీధర్‌నాయుడు , ఎస్‌సీసెల్ సుబ్బరాయుడు, ఎంపీటీసీ శ్రీనివాసులు, పోతన్న, వెంకటరాముడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం క్రైం, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలో శుక్రవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగరపాలిక అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పీఏబీఆర్ నుంచి సరఫరా అయ్యే ప్రధాన పైపులైన్‌కు బళ్లారి బైపాస్‌లో లీకేజీ ఉందన్నారు. పైపులైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

బెళుగుప్పలోనే పరీక్షా కేంద్రం ఉండాలి

- ఏఐఎస్ఎఫ్ నాయకుల వినతి

అనంతపురం విద్య, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : బెళుగుప్ప మండలంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాన్ని స్థానికంగానే ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆర్ఐఓను కోరారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి, ఇతర నేతలు గురువారం ఆర్ఐఓ వెంకటరమణ నాయక్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. బెళుగుప్ప మండలంలోని విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయాలంటే కళ్యాణదుర్గం వెళ్లాల్సి ఉందన్నారు. దాదాపు 20 కిలోమీటర్లకు పైబడి ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రాలకు వెళ్లాలంటే విద్యార్థులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. పరీక్ష సమయానికి ఒక బస్సు మాత్రమే ఉంద న్నారు. ఆ బస్సు మిస్ అయితే విద్యార్థులు అనేక అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. విద్యార్థుల సౌకర్యా ర్థం బెళుగుప్ప మండల కేంద్రంలోనే ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రాధాజ్యోతి, వంశీ, సహాయ కార్యదర్శి చందు, నాయకులు లలిత, తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ. 10

అనంతపురం రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 8, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

మౌలిక వసతులపై దృష్టి పెట్టండి : ఎంఈఓ

చెన్నేకొత్తపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంఈఓ-2 ప్రసూన్ కుమార్ నాయుడు పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో గురువారం మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్‌లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు అంశాలపై ఆర్పీలు కేశవరెడ్డి, రవికుమార్, భూషణప్ప వివరించారు.

సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు

రాప్తాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకుడు ఉప్పర శ్రీనివాసులు పత్రికా ప్రకటనలో తెలిపారు. జనవరి 13న ప్రసన్నాయపల్లిలో, 14న చిన్మయ్‌నగర్‌లో, 15 అయ్యవారిపల్లిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు.

బంగారు దుకాణంలో కమ్మల చోరీ

నార్పల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సంత బజారులో ఉన్న సయ్యద్ బంగారు దుకాణంలో గురువారం మధ్యాహ్నం ఓ మహిళ చోరీకి పాల్పడినట్లు దుకాణ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ సయ్యద్ దుకాణంలోకి వచ్చి కమ్మలు కావాలని అడిగింది. దుకాణం యజమాని కమ్మలు బాక్స్ తీసి చూపిస్తున్నాడు. ఈ క్రమంలో ఆమె జత కమ్మలను చోరీ చేసి, వాటి స్థానంలో తనతోపాటు తెచ్చుకున్న రోల్డ్‌గోల్డ్ కమ్మలు పెట్టింది.పసిగట్టిన దుకాణ యజమాని సయ్యద్, అతని కుమారుడు ఆమెను స్థానిక పోలీసులకు అప్పగించారు. ఆ మహిళను పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థిని మృతిపై విచారణ చేపట్టాలి

- విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్

అనంతపురం సెంట్రల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియేట్ విద్యార్థిని చిన్న తిప్పమ్మ మృతిపై విచారణ చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులతో కలిసి గురువారం కలెక్టరేట్ వద్ద వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి, వేమన మాట్లాడుతూ... విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందన్న విషయాన్ని బంధువులకు తెలుపకుండానే మృతదేహాన్ని మార్చురికీ తరలించడం ఏమిటని ప్రశ్నించారు. మృతిపై పొంతనలేని సమాధానం చెప్పడం, బాధిత కుటుంబ సభ్యులపట్ల నిర్లక్ష్యంగా మాట్లాడం అనుమానాలను కలుగజేస్తోందన్నారు. స్పందించిన డీఆర్వో మలోలులు విద్యార్థిని మృతిపై కమిటీ నియమించి వాస్తవాలను వెలికితీస్తామని, బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, లింగమయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో అవినీతిపై విచారణ

శింగనమల, జవవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జూలాకాలువ పంచాయతీలో గతంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అవినీతిపై గ్రామ సర్పంచ్ ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ డిప్యూటీ డైరెక్టర్ కోలార్ కృష్ణ ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు చేశారు. జూలాకాలువ పంచాయతీ లో 2020-21లో ఉపాధి పథకం ద్వారా రూ.85,71,127 పనులు, 2021-22లో రూ.94,44,912 పనులు జరిగాయి. అయితే వాటిలో అప్పటి ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత అవినీతికి పాల్పడ్డారని జూలాకాలువ కాలువ సర్పంచ్ రాజారెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు రెండుసార్లు తనిఖీలు చేసినా, ఎలాంటి అవినీతి జరగలేదని రిపోర్టు ఇవ్వడం తో సర్పంచ్ కోర్టును కోర్టును ఆశ్రయించారు. దీంతో జిల్లా స్థాయి అధికారులు విజిలెన్స్ డిప్యూటీ డైరెక్టర్ కోలార్ కృష్ణను విచారణాధికారిగా నియమించారు. ఆయన గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో అప్పటి ఉపాధి హామీ పథకం రికార్డులను స్వాధీనం చేసుకుని, క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. శుక్రవారం కూడా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలకూమారి, ఏపీఓ శ్రీదేవి, అప్పటి ఏపీఓ ఎర్రమ్మ, అధికారులు పాల్గొన్నారు.

అంధత్వం శరీరానికే... మనసుకు కాదు

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో కలిసి అంధుల క్రీడా పోటీలు ప్రారంభం



అంధుల చెస్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు దగ్గుపాటి, ఎంఎస్ రాజు

అనంతపురం అర్బన్/ క్లాక్ టవర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : అంధత్వం శరీరానికి మాత్రమేనని, మనస్సుకు కాదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. లూయిస్‌బ్రెయిలీ జయంతి సందర్భంగా జాతీయ అంధుల క్రీడా సమాఖ్య ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కృష్ణకళామందిరంలో అంధుల క్రీడా పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు దగ్గుపాటి, ఎంఎస్ రాజు ముఖ్య అతిథులుగా హాజరై లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంధుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చదరంగం క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అంధులతో కలిసి ఎమ్మెల్యేలు కొద్ది సేపు చెస్ ఆడి వారిని ప్రోత్సహించారు. కూటమి ప్రభుత్వంతోనే దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు సాధ్యమవుతాయని తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 200 మందికి పైగా అంధ క్రీడాకారులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు చెస్, అథ్లెటిక్స్, సాంస్కృతిక పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపుకార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్‌మురళీ, క్రీడా సభ్యులు ఓబుళనాయుడు, అంధుల క్రీడాసమాఖ్య సభ్యులు విజయభాస్కర్, రవి, నాగశివారెడ్డి, నాగార్జున, ఎర్రిస్వామి, కుమార్ రాజా, అంధ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అంధుల క్రికెట్ పోటీలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని అంధుల ఉద్యోగులసంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో రాష్ట్రస్థాయి అంధుల క్రికెట్ పోటీలు నిర్వహించారు. భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ అర్జున్ అవార్డు గ్రహీత అజయ్‌రెడ్డి చేతుల మీదుగా పోటీలను ప్రారంభించారు. రెండు రోజుల పాటు సాగే పోటీలకు 13 జిల్లాల నుంచి అంధుల క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో మీనాక్షమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటరమణ, అంధుల ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి జలంధర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు వెంకటనారాయణ, కార్యదర్శి సంజీవయ్య, ప్రతాప్, నాగరాజు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో సభ్యత్వాల నమోదు

- అర్బన్‌లో 70 వేలు దాటిన సంఖ్య: ఎమ్మెల్యే దగ్గుపాటి



శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న రాఘవేంద్ర చౌదరి, చంద్రశేఖర్‌నాయుడు

అనంతపురం అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గత 30 ఏళ్లల్లో ఎన్నడూ లేని విధంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో సభ్యత్వాల నమోదు జరిగిందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో గురువారం పార్టీ సీనియర్ నాయకులు గుడిపూటి రాఘవేంద్ర చౌదరి, పాలడుగు చంద్ర శేఖర్ నాయుడు రూ.లక్ష చొప్పున చెల్లించి ఎమ్మెల్యే చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వాలు తీసుకున్నారు. వారిని ఎమ్మెల్యే శాలువ కప్పి సన్మానిం చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... సభ్యత్వాల నమోదులో ఈ సారి సరికొత్త రికార్డు నమోదైందని, 30 ఏళ్లల్లో ఎన్నడూ లేని విధంగా 70వేల మందితో సభ్యత్వం చేయించామన్నారు. నమో దు గడువు 15 రోజులు పొడిగించారని, లక్ష సభ్యత్వాల నమోదు లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

ఏడు నెలల్లో రూ.60 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అర్బన్ నియోజకవ ర్గానికి సంబంధించి గత ఏడు నెలల్లో రూ.60 లక్షల సీఎంఆర్ఎఫ్ నిధులు వచ్చాయని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో గురువారం ఆరుగురు లబ్ధిదారులకు రూ.5.67 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఏడు నెలల్లో ఏం అభివృద్ధి చేశారని కొందరు ఆరోపణలు చేస్తున్నారని, వాస్తవాలు గ్రహించకుండా అసత్యాలు పదే పదే వల్లించడం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమాల్లో నాయ కులు గంగారామ్, రాయల్ మురళి, లక్ష్మీనరసింహ, రాంప్రసాద్, అమర్, ధరూర్ నాయుడు, సభ్యత్వాల కో ఆర్డినేటర్ విష్ణు, వడ్డే భవాని, వెంకటేష్, భక్తవత్సలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

5న మాస్టర్స్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్నట్లు మాస్టర్స్ అథ్లెటిక్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్ బాబు, సికింధర్ తెలిపారు. జేఎన్‌టీయూ మైదానంలో నిర్వహించే మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా గురువారం విడుదల చేశారు. వయస్సుతో నిమిత్తం లేకుండా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. సభ్యులు మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి వందేళ్ల వయస్సు వరకు ఉన్న మహిళలు, పురుషులు అథ్లెటిక్స్ పోటీలకు అర్హులన్నారు. పరుగు, స్పీడ్ వాక్ పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు ఫోన్ నంబర్లు 9701856200, 9502539888ను సంప్రదించాలని కోరారు.

5న జిల్లా స్థాయి హాకీ క్రీడాకారుల ఎంపిక

జిల్లా స్థాయి హాకీ సబ్‌జూనియర్ బాల, బాలికల క్రీడా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 5వతేదీన ఆర్డీటీ స్టేడియంలో హాకీ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్ తెలిపారు. 2009 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 17వ తేదీ నుంచి మదనపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాలుర సబ్‌జూనియర్ పోటీలకు, ఈనెల 27వ తేదీ నుంచి ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాలికల పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబరు 9490033474ను సంప్రదించాలని కోరారు.

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో

నూతన సంవత్సర వేడుకలు



వేడుకల్లో కలెక్టర్ వినోద్‌కుమార్, ఆయన సతీమణి, జేసీ, అసిస్టెట్ కలెక్టర్ తదితరులు



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్, జేసీ

అనంతపురం టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం వేడుకలను గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అట్టహాసంగా సాగాయి. కలెక్టర్ వినోద్‌కుమార్, ఆయన సతీమణి, జేసీ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్ఓ మలోలతో కలిసి భారీకేక్ కట్‌చేసి తమ ఆనందం పంచుకున్నారు. అనంతరం వివిధ విభాగాలకు చెందిన జిల్లా ఉన్న తాధికారులు తమ సిబ్బందితో కలిసి వచ్చి కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంఎస్ రాజు, వివిధ ప్రాంతాలకు చెందిన పలు వర్గాల నేతలు, ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్స ర శుభాకాంక్షలు తెలియజేశారు. ఉదయం 9-30 గంటల నుంచి సాయంత్రం వరకు కలెక్టర్ క్యాంపు కార్యాలయం కిటకిటలాడుతూ కనిపించింది.

వైద్యశాఖ ఆధ్వర్యంలో...

జిల్లా కేంద్రంలోని వైద్యశాఖల కార్యాల యాలో నూతన సంవత్సర వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా సర్వజ నాస్పత్రిలో సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు చేతులమీదుగా కేక్‌కట్ చేయించి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, ఆర్ఎంఓలు, డాక్టర్లు, స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బంది సంతోషం పంచుకున్నారు. అలాగే జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ ఈబీ దేవి చేతులుమీదుగా కేకు కట్‌చేయించారు.

జోనల్ చైర్మన్‌కు ఆర్టీసీ ఉద్యోగుల శుభాకాంక్షలు

అనంతపురం కల్చరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజుకు ఆర్టీసీ ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ పీటీడీ కార్మిక పరిషత్ ఆధ్వర్యంలో గురువారం పూల నాగరాజును ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్మిక పరిషత్ రీజనల్ కమిటీ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, కార్యదర్శి ఈడీ ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కోళ్లను తరలిస్తున్న వ్యాన్ బోల్తా



బోల్తాపడిన వ్యాన్

బెళుగుప్ప, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దేకుంట సమీపంలో గురువారం కోళ్ల ను తరలిస్తున్న వెళుతున్న ఐషర్ వాహనం బోల్తా పడింది. కళ్యాణదుర్గం నుంచి గుంతకల్లుకు వెళుతున్న ఐషర్ ప్రమాదవశాత్తూ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో 500 కోళ్లు మృతి చెందాయి. రూ.లక్షకుపైగా నష్టం వాటిల్లినట్లు డ్రైవర్ విజయ్‌కుమార్ తెలిపారు. డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి అపాయం జరగలేదు.

ఎస్‌ఐ బదిలీ

పుట్లూరు, జనవరి2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ హేమాద్రి బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం రిలీవ్ అయ్యారు. ఈయన చిత్తూరు జిల్లాకు బదిలీ అయినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. నూతన ఎస్‌ఐగా చిత్తూరు జిల్లా తిరుపతి నుంచి నరసింహ రానున్నట్లు తెలిసింది. బదిలీ విషయంపై ఏఅధికారి మీడియాకు సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. ఎవరికి తెలియకుండా ఎస్‌ఐ వెళ్లిపోవడం అనుమానాలకు తావిస్తోంది.

మాధవీలతపై పోలీసులకు ఫిర్యాదు

తాడిపత్రి, జనవరి2(ఆంధ్రజ్యోతి): సినీ నటి మాధవీలతపై చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం టీడీపీ కౌన్సిలర్లు రేష్మాపర్వీన్, జింకా లక్ష్మీదేవి, అరుణ, జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ ఎస్‌ఐ గౌస్‌బాషాకు ఫిర్యాదుచేశారు. స్థానిక జేసీ పార్క్‌లో నిర్వహించిన న్యూఇయర్ వేడుకలకు సంబంధించి సోషల్ మీడియాలో అసత్య వ్యాఖ్యలు చేసిన మాధవీలతపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.

బీజేపీ మండలాల అధ్యక్షుల ఎన్నిక

శెట్టూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా చింతర్లపల్లి గ్రామానికి చెందిన నాగరాజు యాదవ్‌ను ఎన్నుకున్నారు. మండలకేంద్రంలో గురువారం ఆర్‌వో గంగాధర సమక్షంలో నాయకులు, కార్యకర్తలు ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు బంగారు మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ముప్పూరి దేవరాజు, సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ నగేష్, సీనియర్ నాయకుడు నంజుండరావు, మండలమాజీ అధ్యక్షుడు వెంకటరమణస్వామి, కుందుర్పి మండల మాజీ అధ్యక్షుడు వెంకటేష్, బ్రహ్మసముద్రం మండల అధ్యక్షుడు రామదాసు కరేగౌడ, కళ్యాణదుర్గం పట్టణ అధ్యక్షుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో గుడిసె పాతన్న మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాతన్న మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శాంతకుమార్, అసెంబ్లీ కన్వీనర్ దేవరాజు కు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గూబనపల్లి లేఔట్‌లో గత బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్‌ను ఎత్తుకెళ్లారు. మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా ధ్వంసం చేయడానికి ప్రయత్నించి మధ్యలోనే ఆపేశారు. తరచూ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దుండగులు పొలాల్లో ఎవరూలేని ప్రదేశాలలో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేయడమే లక్ష్యంగా చెలరేగిపోతున్నారని ప్రజలు వాపోతున్నారు. నెలకు కనీసం రెండు మూడు చోట్ల ఇటువంటి సంఘటనలు జరుగుతున్న పోలీసులు దొంగలను పట్టుకోవడంలో విఫలమవు తున్నారనే విమర్శలకు తావిస్తోంది. ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌లను వీఆర్వో ముత్యాలప్ప, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు.

కంది మద్దతు ధర రూ.7550

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో రైతుల నుంచి కందులను ప్రభుత్వం రూ. 7550ల మద్దతు ధరతో కొనుగోలు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి పొందిందని జిల్లా మార్క్‌ఫెడ్ ఛైర్మన్ పెన్నేశ్వరి గురువారం ప్రకటనలో తెలిపారు. కళ్యాణదుర్గం డివిజన్‌లో కందులు పండించిన రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా తమ పంటను నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు కేవలం 103మంది రైతులు మాత్రమే నమోదు చేసుకున్నారన్నారు. ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు మాత్రమే రైతు సేవాకేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారంరోజులలోపు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని చెప్పారు.

డీఎస్సీ అభ్యర్థులకు మోడల్ టెస్ట్

కళ్యాణదుర్గం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థులకు ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో త్వరలో మోడల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ గురువారం ప్రకటనలో తెలిపారు. ట్రస్టు ఏర్పాటు చేసి యేడాది పూర్తి అవుతున్న సందర్భంగా ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా వున్న అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటి ర్యాంకు వచ్చిన వారికి రూ. 20 వేలు, రెండో ర్యాంకు వచ్చిన వారికి రూ.15 వేలు, మూడో ర్యాంకు వచ్చిన వారికి రూ.పది వేలు నగదు బహుమతులు అందిస్తామన్నారు. నాలుగు నుంచి 50వ ర్యాంకు వచ్చిన వారికి కూడా నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. వివరాలకు 9493976058, 9491834267, 8008020250 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

యల్లనూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండ లంలోని 85నిట్టూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మస్టర్ల ఆధారంగా పనిచేస్తున్న వారి హాజరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కూలీలు రోజుకు ఆరు గంటల పాటు పనులు చేయాలన్నారు. తొందరగా వెళితే పని తక్కువ కావడంతో కూలిడబ్బులు కూడా తక్కువగా వస్తాయని అన్నారు. సమయపాలన తప్పక పాటించాలని సూచించారు.

రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు

● రెవెన్యూ సదస్సులో ప్రభుత్వ విప్ కాలవ



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంరూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రైతు పక్షపాతి సీఎం చంద్రబాబు అని, రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తున్నారని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని మెచ్చిరి గ్రామంలో గురువారం తహసీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా కాలవ శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరిగే పని లేకుండా.. కూటమి ప్రభుత్వం గ్రామాల్లోనే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. ఇందులో రైతులు సమస్యలను అధికారులకు తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు నిరంతర కృషిచేస్తున్నారన్నారు. జగన్ ప్రవేశపెట్టిన ల్యాండ్‌టైటిలింగ్ యాక్టును అధికారంలోకి రాగానే చంద్రబాబు రద్దు చేశారని తెలిపారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ కొండన్న, టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, సర్పంచ్ వన్నూరుస్వామి, నాయకులు సదాశివారెడ్డి, కాటా వెంకటేశులు, సోమశేఖర్, మల్లికార్జున, తిమ్మారెడ్డి, భీమయ్య, మనోహర్‌నాయుడు, లచ్చన్నచౌదరి, గోవిందరాజులు, హనుమంతు, జనార్ధన, బట్టి తిప్పేస్వామి, నీలప్ప, తిప్పయ్య, సిద్ధప్ప, జోగప్ప పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రులపై నమ్మకాన్ని పెంచండి

కణేకల్లు: ప్రజల్లో ప్రభుత్వాసుపత్రులపై నమ్మకాన్ని పెంచాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు వైద్యులకు సూచించారు. మండల కేంద్రంలో గల కమ్యూనిటీ వెల్ సెంటర్‌లో ఆసుపత్రి సలహామండలి కమిటీ సమావేశాన్ని నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానంగా ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగుల్లో చాలామంది పేదలే ఉంటారన్నారు. అటువంటి వారికి బాధ్యతయుతంగా వైద్యసేవందించాలని ఆదేశించారు. గతంలో ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకుని ఇబ్బందికరంగా ఉన్నపుడు, తాను మంత్రిగా నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యులు అందుబాటులో ఉన్నా.. ఆసుపత్రిపై ప్రజలకు నమ్మకం లేకపోవడం బాధాకరమన్నారు. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి రోగులకు వైద్యం అందించాలని ఆదేశించారు. వైద్యులు నిరీష, చంద్ర, ఆసుపత్రి కమిటీ సభ్యులు కురుబ నాగరాజు, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, బీటీ రమేష్, చంద్రశేఖర్‌గుప్తా, చాంద్‌బాషా, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.



యాడికి హైస్కూల్లో సైన్స్‌ఫెయిర్‌ను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు



యల్లనూరు జడ్పీ హైస్కూల్లో ..



కూడేరులో ..

పాఠశాలల్లో సైన్స్ ఫెయిర్

వివిధ నమూనాలను తయారు చేసి ప్రదర్శించిన విద్యార్థులు

ఉరవకొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం సైన్స్ ఫెయిర్‌ను ఘనంగా నిర్వహించారు. ఇందులో విద్యార్థులు వివిధ నమూనాలు తయారు చేసి ప్రదర్శనకు ఉంచారు. పలు నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వీటిని ఎంఈఓలు ఈశ్వరయ్య, రమాదేవిలు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. అలాగే వజ్రకరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఎంఈవో ఎర్రిస్వామి, తిమ్మప్పలు ప్రారంభించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు అనిత, స్వర్ణలత పాల్గొన్నారు.

యాడికి: మండలకేంద్రంలోని హైస్కూల్‌లో మండలస్థాయి సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమాన్ని ఎంఈఓ-2 ధనలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు రూపొందించిన టచ్‌లెస్ డోర్‌ఓపెన్, మినరల్ వాటర్ తయారీ నమూనాలు ఆకట్టుకున్నాయన్నారు. హెచ్‌ఎంలు నాగన్న, డేనియల్, చిన్నపెద్దన్న, పలువురు సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని ఆదర్శపాఠశాలలో మండలస్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఇందులో పలు గ్రామాల విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించిన పలు నమూనాలను విద్యాధికారులు పరిశీలించారు. నీటి ఆదా, ఆరోగ్యం, పలు ఎలక్ట్రికల్‌కు సంబంధించి ప్రాజెక్ట్ నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఎంఈఓ శ్రీదేవి, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యల్లనూరు: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో సైన్స్ ఫెయిర్‌ను ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పలు సైన్స్ నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. పలు పాఠశాల విద్యార్థులు వివిధ నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. ఎంఈఓలు మల్లికార్జున, వీరన్న వాటిని పరిశీలించారు. హెచ్‌ఎం రాజ్‌కుమార్, కే జీబీవీ ప్రిన్సిపాల్ కమలమ్మ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని మోడల్ స్కూల్లో మండలస్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన పలు వివిధ నమూనాను సీఐ వెంకటేశ్వర్లు, ఎంఈఓ రవినాయక్ పాల్గొని, పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఉష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఇందులోవిద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలను విద్యాశాఖాధికారి మల్లారెడ్డి హెచ్‌ఎం వెంకటప్రసాద్, పీఈటీ రాజశేఖర్, ఉపాధ్యాయ బృందం పరిశీలించారు.

కూడేరు: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల్లో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన పలు నమూనాలను ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఉపాధ్యాయులు పరిశీలించారు.

రేషన్ బియ్యం కోసం మహిళల ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలు

ఉరవకొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం సక్రమంగా అందడం లేదంటూ పట్టణంలోని 10వ వార్డు మహిళలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఆరునెలలుగా తమకు రేషన్ బియ్యం అందడం లేదని వాపోయారు. రేషన్ సరుకుల కోసం పనులను మానుకుని తిరగాల్సి వస్తోందన్నారు. స్టోర్లు దగ్గర వేయరు, రేషన్ బండ్లు కూడా రావడం లేదని అన్నారు. రేషన్ బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ఎవరూ లేకపోవడంతో ఫోన్‌లో సీఎస్‌డీటీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

పంచాయతీ అభివృద్ధికి తోడ్పడండి: ఎంపీడీఓ

పామిడి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఇందులో ఎంపీడీఓ తేజోత్స్న మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ పరిధిలోని పేద ప్రజలు, కూలీలు ఉపాధి హామీ పథకం పనులు చేసుకొని ఉపాధి పొందవచ్చునన్నారు. కూలీల కోసం చాలా పనులు మంజూరు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కృష్ణకుమార్, ఈఓ గోపాల్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ప్రభాకర్‌చౌదరి, మాజీ ఎంపీటీసీ జింకల సంజీవకుమార్, మాజీ కౌన్సిలర్ చెన్నవరం మహబూబ్ బాషా, జనసేన మండల అధ్యక్షుడు ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

గుత్తి రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ సీఐ అన్నపూర్ణ, ఎస్‌ఐ హరికృష్ణ ఆధ్వర్యంలో గుత్తి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు నాటు సారా తయారీ కేంద్రాలపై గురువారం దాడులు నిర్వహించారు. పామిడి మండలం రామగిరి దిగువ తండా శివారులో 300 లీటర్ల నాటు సారా బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అలాగే గుత్తి మండలం మామడూరు సమీపంలో మరో 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ ఫణీంద్రనాథ్, కానిస్టేబుళ్లు శివానందరెడ్డి, మారుతి, పుష్ప పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

ఉరవకొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని పీసీ ప్యాపిలి తండాకు చెందిన ఆదినారాయణ నాయక్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగస్వామి గురువారం తెలిపారు. ఆదినారాయణ నాయక్ అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని, నమ్మించి మోసం చేశాడని, దీంతో బాలిక, ఆమె తల్లిదండ్రులు అతడిపై ఫిర్యాదు చేశారని, ఆ మేరకు కేసు నమోదు చేశామని అన్నారు. అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

రోడ్డుకు మరమ్మతులు

గుత్తి, జనవరి2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గుంతలమయమైన రోడ్డుకు ఆర్‌అండ్‌బీ అధికారులు గురువారం మరమ్మతు పనులు చేపట్టారు. గుత్తి ఆర్‌ఎస్ రోడ్డులో పెద్దఎత్తున గుంతలు ఉండడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలు పూడ్చి తారు వేశారు.

అక్రమార్కులపై చర్యలేవీ..?

● ఉపాధి పనుల్లో అక్రమాలపై రెండోసారి విచారణ
● నిర్ధారణ అయినా.. మౌనంగానే డ్వామా అధికారులు
● నెలన్నర గడిచినా చర్యలు శూన్యం



రాయపల్లిలో విచారణ చేస్తున్న అధికారులు (ఫైల్)

ఉరవకొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవడంలో జిల్లా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కూలీల వలసలను నివారించి వారికి ఉన్న చోటే ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ప్రారంభించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉరవకొండ మండలంలో నీరుగారి పోతోంది. మండలంలో 18గ్రామ పంచాయతీల్లో 2023-24 వ ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.9.15కోట్ల వ్యయంతో పనులు జరిగాయి. అందులో రూ.5.90 కోట్లు కూలీలకు, రూ.3.24కోట్లు మెటీరియల్‌కు ఖర్చు చేశారు. గత ప్రభుత్వ హయాంలో మస్టర్లను కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ నుంచి తీసుకెళ్లాల్సి ఉండగా, ఫీల్డ్ అసిస్టెంట్లే వద్ద ఉంచుకుని, అధికారులతో కుమ్మక్కై బినామీ పేర్లతో ఉపాధి నిధులను దిగమింగారు. సామాజిక తనిఖీల్లో అక్రమాలు బయటకు వచ్చినా, నామమాత్రపు రికవరీలకు ఆదేశించి చేతులు దులుపుకుంటున్నారు. ఓపెన్ ఫోరమ్‌లో రూ.78.66లక్షలు దుర్వినియోగం అయినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఓపెన్ ఫోరం జరిగి రెండు నెలలు పూర్తి అయినా ఇప్పటి వరకూ అక్రమాలకు పాల్పడిన వారి నుంచి ఒక్కపైసా కూడా రికవరీ చేయలేదు. అంతేకాకుండా ఏ ఒక్క అధికారిపైనా శాఖపరమైన చర్యలు తీసుకోలేదు. దీంతో డ్వామా అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ అధికారులు అక్రమార్కులకే అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉపాధి అక్రమాలపై పెద్ద ఎత్తున కలెక్టర్‌కు ఫిర్యాదులు అందగా.. వాటిపై రెండో సారి విచారణకు ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి, ఏపీడీ శైలజ, రాయంపల్లి, బూదగవి గ్రామాల్లో జరిగిన అక్రమాలపైన పునర్విచారణ చేపట్టారు. రాయంపల్లిలో ఉపాధి పనులకు సంబంధించి రూ.6లక్షల వరకూ అక్రమాలు జరిగాయి. గ్రామాల్లో లేని వ్యక్తులు, విదేశాల్లో ఉన్న వారు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఉపాధి పనులు చేసినట్లు మస్టర్లలో చూపించి డబ్బు కాజేసినట్లు అధికారులు గుర్తించారు. అలాగే బూదగవిలో ఫాంపాండ్ పనుల పేరుతో రూ.2.10లక్షలు కాజేశారు. టెక్నికల్ అసిస్టెంట్ చెక్ మెజర్‌మెంట్ చేయకుండా డబ్బులను స్వాహా చేసినట్లు వెల్లడైంది. దివ్యాంగులు మీద, ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటున్న వారి మీద మస్టర్లు రాసి, డబ్బులు మింగేసినట్లు అధికారుల విచారణలో వెలుగులోకి వచ్చింది. కాగా రెండోసారి ఉపాధి అక్రమాలపై విచారణ చేసి నెలన్నర గడుస్తున్నా.. అక్రమార్కులపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. డ్వామా అధికారుల మౌనం వెనక ఆంతర్యమేమిటో ఎవరికీ అంతు చిక్కడం లేదు. ఈ విషయం ఏపీడీ శైలజను వివరణ కోరగా విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేశామని తెలిపారు.

బెళుగుప్పలోనే పరీక్షా కేంద్రం ఉండాలి

● ఏఐఎస్‌ఎఫ్ నాయకుల వినతి

అనంతపురం విద్య, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : బెళుగుప్ప మండలంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థు ల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాన్ని స్థానికంగానే ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఆర్‌ఐఓను కోరారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి, ఇతర నేతలు గురువారం ఆర్‌ఐఓ వెంకటరమణ నా యక్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. బెళుగుప్ప మండలంలోని విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయా లంటే కళ్యాణదుర్గం వెళ్లాల్సి ఉందన్నారు. దాదాపు 20 కిలోమీటర్లకు పైబడి ప్రయాణం చేయాల్సి వస్తుంద న్నారు. ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రాలకు వెళ్లాలంటే విద్యార్థులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. పరీక్ష సమయానికి ఒక బస్సు మాత్రమే ఉందన్నారు. ఆ బస్సు మిస్ అయితే విద్యార్థులు అనేక అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. విద్యార్థుల సౌకర్యా ర్థం బెళుగుప్ప మండల కేంద్రంలోనే ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రాధాజ్యోతి, వంశీ, సహాయ కార్యదర్శి చందు, నాయకులు లలిత, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నేరం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

తాడిపత్రి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యానేరమని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ తెలిపారు. పట్టణంలోని నందలపాడులో ఉన్న మోడల్‌స్కూల్‌లో గురువారం కిశోరి వికాసం- బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు బాలికలను బాగా చదివించాలన్నారు. అలాకాకుండా బాల్యవివాహాలు చేస్తే వారి అభివృద్ధికి ఆటంకం ఏర్పడి ఎన్నో ఆటంకాలు ఎదురవుతాయని తెలిపారు. బాల్యవివాహాలను నిర్మూలించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. రాష్ట్రాన్ని బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు అందరూ కృషిచేయాలని కోరారు. అనంతరం డీఎస్పీ రామకృష్ణుడు, ఐసీడీఎస్ సీడీపీఓ సాజిదాబేగం, డాక్టర్ సుమన్‌తో కలిసి బాల్యవివాహాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

అరటికి యాడికి మండలం ఫేమస్ సార్

● కలెక్టర్‌కు అరటిగెలను అందజేసిన రెవెన్యూ సిబ్బంది



కలెక్టర్‌కు అరటిగెలను అందజేస్తున్న తహసీల్దార్, సిబ్బంది

యాడికి, జనవరి2(ఆంధ్రజ్యోతి): న్యూఇయర్ సందర్భంగా మండల రెవెన్యూ సిబ్బంది కలెక్టర్ వినోద్‌కుమార్‌ను జిల్లా కేంద్రంలో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు అరటిగెలను కానుకగా అందజేశారు. యాడికి మండలం అరటి సాగుకు చాలా ప్రత్యేకమని కలెక్టర్‌కు తెలిపారు. సుమారు 2వేల ఎకరాలకు పైగా రైతులు అరటిసాగు చేస్తున్నారని వివరించినట్లు సిబ్బంది తెలిపారు. తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి, డిప్యూటి తహశీల్దార్ శ్రీనివాసులు, పలువురు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

డీఆర్‌ఎంతో ఎంయూ నాయకుల భేటీ

గుంతకల్లు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): డివిజనల్ రైల్వే మేనేజరుగా విధుల్లో చేరిన సీఎస్ గుప్తాతో మజ్దూర్ యూనియన్ నాయకులు గురువారం భేటీ అయ్యారు. డ్యూటీలో చేరిన డీఆర్‌ఎంకు స్వాగతం పలికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీఆర్‌ఎంను శాలువతో సన్మానించి కార్మికులు, ఉద్యోగుల సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ రిటైర్డు అసోసియేషన్ డివిజనల్ కార్యదర్శి మస్తాన్ వలి, నాయకులు సాయి శేఖర్, కరీం బాషా, కనకరాజు, నాగరాజు, ఖాజాఖాన్, అశోక్, వెంకటేశ్, పీ వీరేశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ జూనియర్ అసిస్టెంట్ మృతి

తాడిపత్రి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అనిల్‌కుమార్ (32) అనారోగ్యంతో కర్నూలులో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడని తహసీల్దార్ రజాక్‌వలి తెలిపారు. గుత్తికి చెందిన అనిల్‌కుమార్ 2022 నుంచి విధులు నిర్వహిస్తున్నారన్నారు. కాగా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారన్నారు. 20రోజులుగా కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడు మృతి చెందినట్లు చెప్పారు. ఆయన మృతికి కార్యాలయ సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు.

తూతూ మంత్రంగా గ్రామసభ

ఉరవకొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభను అధికారులు తూతూ మంత్రంగా నిర్వహించారు. సర్పంచ్ లలితమ్మ అధ్యక్షతన జరిగిన సభకు ప్రజలు ఎవరూ రాలేదు. సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులతో మమ అనిపించారు. ఈ సభలో ఎంపీపీ నరసింహులు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని అధికారులను కోరారు. సీవీవీ నగర్‌లో కుళాయిలకు నీరు సక్రమంగా రావడం లేదని ఆ కాలనీ వాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరం

యాడికి, జనవరి2(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యాభివృద్ధి కోసం విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఎంఈఓ-1 కాశప్ప తెలిపారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల అధ్యక్షులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థుల్లో విద్యాభివృద్ధి కోసం తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. తల్లిదండ్రులు తరచూ పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల చదువు సామర్థ్యాలపై ఉపాధ్యాయులతో చర్చించాలని తెలిపారు. సమావేశంలో పలువురు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల అధ్యక్షులు, పలువురు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వైద్యుడు, నర్సులపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లుటౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించిన వైద్యుడు, నర్సులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ రక్షణ సమితి అధ్యక్షుడు మహేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్ర రావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ డిసెంబరు 31న కొమ్ము రామాంజనేయులు అనే దళితుడిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారన్నారు. అతన్ని బంధువులు అదే రోజు రాత్రి 11.30గంటలకు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారన్నారు. డ్యూటీలో ఉన్న డాక్టర్, నర్సులు,సెక్యూరిటీ గార్డు ఎవరూ పట్టించుకోలేదన్నారు. దీంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారన్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహించిన వైద్యుడు, నర్సులపై విచారణ చేసి చర్య లు తీసుకోవాలని కోరారు. విన తి పత్రం ఇచ్చిన వారిలో స మితి ప్రధాన కార్యదర్శి కోరి చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.